



రేపల్లె : ఓలేరుపల్లెపాలెం వద్ద ఇసుకబస్తాలతో పటిష్టపరిచిన కరకట్ట(ఫైల్)

వేతన వెతలు



● నీరుగారుతున్న ఉపాధి హామీ పథకం లక్ష్యం ● కూలీల వేతనాలు రూ.51.37 కోట్లు ● మెటీరియల్ బకాయిలు రూ.154.46 కోట్లు ● మూడు నెలలుగా నిలిచిపోయిన చెల్లింపులు ● ఆర్థిక ఇక్కట్లతో కష్టజీవుల ఎదురు చూపు ● బిల్లులు మంజూరు కాక నిలిచిన పనులు ● చోద్యం చూస్తున్న పాలకులు

ఉపాధి వేతనం చెల్లింపులు సకాలంలో జరగడంలేదు. నెలల తరబడి వేతనాలు నిలిచిపోతున్నాయి. చేసిన పనికి సొమ్ములు అందక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. 90 రోజులుగా వేతన చెల్లింపులు నిలిచిపోయాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రూ.51.37 కోట్లు వేతన బకాయిలు పేరుకుపోయాయి. వేతనం ఇప్పించాలన్న కూలీల మొర ఆలకించే నాథుడే కరువయ్యారు. పరిస్థితి తీవ్రంగా ఉన్నా పాలకులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి కూలీలు చేసిన పనికి వేతనం పాస్ పుస్తకాలు చేతపట్టుకొని బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఖాతాలు ఖాళీగా కనిపించడంతో నిరాశకు లోనవుతున్నారు. ఉపాధి కార్యాలయాలకు వెళితే.. వేతనం రేపో మాపో బ్యాంకు ఖాతాకు జమ అవుతుందని అధికారులు చెప్పి పంపించేస్తున్నారు. జనవరి 15 నుంచి ఇప్పటి వరకు పనులు చేసిన కూలీలకు ఉపాధి సొమ్ము చెల్లించలేకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. పనులకు సంబంధించిన సామగ్రి బిల్లుల బకాయిలు రూ.154.46 కోట్లు పేరుకుపోయాయి. ప్రతివారం క్షేత్రస్థాయి సిబ్బంది కార్మికుల వారీగా వేతనం వివరాలను మండల కార్యాలయానికి పంపిస్తారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రెండు రోజులకు కూలీల ఖాతాల్లో నగదు జమ చేయాలి. కానీ, మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించట్లేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు.

నీరుగారుతున్న ఉపాధి లక్ష్యం

వలసల నివారణకు, వ్యవసాయ, కార్మిక కూలీలకు పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం అమలులో నీరుగారిపోతోంది. చేసిన పనికి రెండు రోజుల్లో ప్రతి కూలీకి సొమ్ము వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయాలి. అయితే వేతనాలు చెల్లింపుల్లో నిర్లక్ష్యం తాండవిస్తోందని కూలీలు వాపోతున్నారు. వెనువెంటనే కూలి రాకపోవడంతో ఉపాధి పనుల పట్ల కూలీలు ఆసక్తి కనబరచడంలేదు. పల్నాడు జిల్లాలో రూ.19.86 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.8.69 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ 22.82 కోట్లు వేతన బకాయిలు ఉన్నాయి.

విముఖత చూపుతున్న కూలీలు

ప్రభుత్వం ఉపాధి కూలీకి కనీస రోజు వేతనం రూ.307గా నిర్ణయించింది. ఈ మేరకు వేతనం కూలీలకు లభించడంలేదు. వ్యక్తిగత పని దినాలు కల్పించడంలో యంత్రాంగం అలసత్వం వహిస్తుందన్న ఆరోపణలు న్నాయి. పల్నాడు జిల్లాలో అత్యధికంగా 5.77 లక్షల జాబ్ కార్డులు నమోదు చేశారు. గుంటూరు జిల్లాలో 2.09 లక్షలు, బాపట్ల జిల్లాలో 4.72 లక్షల జాబ్ కార్డులున్నాయి. నమోదు చేసుకున్నవారందరూ పనులకు హాజరు కావడంలేదు. పల్నాడులో 4.53 లక్షలు, బాపట్లలో 3.74 లక్షలు, గుంటూరులో 1.51 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. వీరు మాత్రమే ఉపాధి పనులకు హాజరవుతున్నారు. పేరు నమోదు చేసుకుని, పనులకు హాజరు కాని కూలీల సంఖ్యలో లక్షల్లో ఉండటం గమనార్హం. వెనువెంటనే వేతనం చెల్లించి ఆదుకోవాలని ఉపాధి కూలీలు అధికారులను కోరుతున్నారు.

వేసవి భత్యాలు రద్దు


గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి ఫిబ్రవరిలో 20శాతం, మార్చిలో 25, ఏప్రిల్‌లో 30 శాతం అదనపు వేతనం ఇచ్చేవారు. మూడేళ్లుగా దీనిని తొలగించారు. వీటితో పాటు పార, గడ్డపార, తాగునీరు, మజ్జిగకు సంబంధించి అదనపు భత్యం ఉండేది. గతంలో మాదిరిగా పని ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు, గాయాలైతే ప్రాథమిక చికిత్స బాక్స్‌లు ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు. వేసవి భత్యం, సౌకర్యాలు సమకూర్చడంతో పాటు సకాలంలో వేతనం చెల్లిస్తే పనుల్లోకి వచ్చే వేతనదారుల సంఖ్య పెరుగుతుందంటున్నారు.

బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం


జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రహదారులు, మురుగు కాల్వలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణం పనులు చేపట్టారు. వీటితో పాటు గోకులం షెడ్లు తదితర పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు స్తంభించి పోయాయి. పూర్తయిన పనులకు నెలలు తరబడి బిల్లులు ఆగిపోయాయి. పల్లె పండుగ పథకం ప్రారంభంలో మొదటి రెండు వారాలు బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరిగాయి. అనంతరం చెల్లింపులు నిలిపోవడంతో పనులూ ఆగిపోయాయి. పల్నాడు జిల్లాలో 80.49 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.58.18 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.15.79 కోట్లు బిల్లులు చెల్లించాలి. కమిటీల పర్యవేక్షణలో చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపులు జాప్యం జరుగుతుండటంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ బలహీనంగా కృష్ణానది కరకట్టలు ◆ ప్రకాశం బ్యారేజీకి దిగువన మరింత ప్రమాదకరం ◆ ఎగువన పటిష్టతకు రూ. 1100 కోట్ల నిధులు ◆ వరదలొస్తే దిగువ కరకట్టకు ఎక్కడ గండ్లు పడేనో? ◆ భయం గుప్పిట్లో కృష్ణా తీర గ్రామాలు ◆ గతేడాది వరదలకు వణికిపోయిన గ్రామాలు ◆ రూ. 2 వేల కోట్లతో ప్రతిపాదనలు పంపిన ఆర్సీ ◆ నదీ తీరం వెంబడి ఉన్న నలుగురు మంత్రులపైనే ఆశ

దిగువన దిగులు



ఓలేరుపల్లెపాలెంవద్ద కృష్ణానది కరకట్టకు గండిపడిన ప్రాంతం (ఫైల్)



కొల్లూరు-ఈపూరు మధ్య సింగిల్ రోడ్డుగా ఉన్న కరకట్ట కోతపడి ప్రమాదకరంగా మారిన చిత్రం

తెనాలి, రేపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి వరదొచ్చిందంటే తీరంలో ప్రకాశం బ్యారేజీకి దిగువన ఉన్న గ్రామాలు వణికి పోతుంటాయి. బ్యారేజీ దిగువన కరకట్ట సీతానగరం నుంచి నది సముద్రంలో కలిసే ప్రదేశం లంకెవానిదిబ్బ వరకు 86 కి.మీటర్లు విస్తరించి ఉంది. కృష్ణా నదికి వరదలు వచ్చినప్పుడు ఈ కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు ప్రాణాలు గుప్పిట పట్టి బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కృష్ణా ఎగువ భాగాన కుడి కరకట్టను విస్తరించి, నాలుగు లేన్ల రహదారిని నిర్మించేందుకు నిధులు కూడా మంజూరు చేసింది. ప్రకాశం బ్యారేజీ ఎగువన వైకుంఠపురం వరకు ఉన్న కరకట్టలో 7 కి.మీటర్ల దూరాన్ని పటిష్టపరచడంతోపాటు, నదిలో గోడ నిర్మాణం కూడా చేసేలా రూ.1,100 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది.

రూ.2వేల కోట్లతో ఆర్సీ ప్రతిపాదనలు

ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణానది కరకట్ట పటిష్టతకు ఇంకా మోక్షం లభించలేదు. దిగువ కరకట్టనూ బలపరిచేందుకు ప్రభుత్వానికి నదీ పరివాహక ప్రాంత పరిరక్షణ విభాగం రివర్ కన్జర్వేటరీ(ఆర్.సి) రూ.2వేల కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి తాజాగా పంపింది. ఎగువ కరకట్ట రాజధాని ప్రాంతానికి ఎంత అవసరమో, దిగువన కరకట్టను పటిష్టపరచడం కూడా అంతే అవసరం ఉంది.

కరకట్ట బలహీనం..గండ్లకు అవకాశం

కృష్ణా నదికి వరదలొచ్చినప్పుడు పొరపాటున కరకట్టకు ఎక్కడైనా గండి పడితే ఏంటి పరిస్థితి!..ఈ మాట తలచుకుంటేనే తీర గ్రామాల ప్రజల వెన్నులో వణుకు పుడుతుంది. దీనికి గత ఓలేరు గండి ఉదంతమే నిదర్శనం. వల్లభాపురం వంటి గ్రామాల దగ్గర్లో గండ్లు పడితే దిగువ గ్రామాల్లో జలప్రళయ తప్పదు. 86 కి.మీటర్ల పొడవునా కరకట్ట పటిష్టంగా లేకపోవడంతో గండ్లు పడడానికి అనేకచోట్ల సిద్ధంగా ఉంది. గతంలో మొత్తం కుడి కరకట్టను పటిష్టపరిచి, రోడ్డు నిర్మాణం చేపట్టేలా అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ. 119 కోట్లు దీనికోసం కేటాయిస్తే, సీతానగరం నుంచి పెనుమూడి వరకు రూ. 111 కోట్లతో కరకట్టను మట్టితో బలపరచడం, ఉన్న ఎత్తుకంటే మరింత ఎత్తు పెంచడం, కరకట్ట పైభాగం 4 నుంచి 7 అడుగుల వెడల్పు ఉంటే దానిని 12 అడుగులకు పెంచడం వంటి పనులు చేపట్టారు. దీనిపై డబుల్ రోడ్డు కూడా నిర్మాణం చేశారు. అయితే తాడేపల్లి, విజయవాడ క్లబ్ దగ్గర కొంత భాగం, పెదకొండూరు - వల్లభాపురం మధ్య, ఈపూరు-కొల్లూరు, దోనేపూడి-పెదపులివర్రు ప్రాంతాల్లో అసలు కరకట్ట పటిష్టపరచలేదు. కొన్నిచోట్ల భూములు ఇవ్వడానికి రైతులు సమ్మతించకపోవడం, మరికొందరు కోర్టును ఆశ్రయించడంతో ఈ ప్రాంతాల్లో కరకట్ట ఆధునికీకరణ జరగలేదు. దీంతో ఇక్కడ కరకట్ట చిక్కి శల్యమైపోయి ఉంటే, చాలాచోట్ల వర్షాలకు కరకట్ట అంచులు కోతపడిపోయి ఉన్నాయి. ఆధునికీకరణ పనులు జరిగిన చోట్ల కూడా కరకట్ట కుంగిపోయి, గతేడాది వచ్చిన వరదలకు అంచుల వరకు నీరు ప్రవహించి, జనానికి దడ పుట్టించింది.

వెంటాడుతున్న గత పీడకలలు

- కృష్ణా నదికి 2009లో వచ్చిన వరదలకు భట్టిప్రోలు మండలం ఓలేరు దగ్గర కరకట్టకు గండిపడింది. పలు గ్రామాలతోపాటు, రేపల్లె పటణం కూడా వరద నీటిలో చిక్కుకుపోయింది. పట్టణంలోనే పడవలపై ప్రయాణం చెయ్యాల్సి వచ్చింది. గ్రామాల్లో వరద ముంపు వీడడానికి నెలపైనే పట్టింది.
- గతేడాది కృష్ణా నదికి రికార్డు స్థాయిలో 11.36 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించింది. దుగ్గిరాల మండలం పెదకొడూరు నుంచి రేపల్లె మండలం లంకెవానిదిబ్బ వరకు జనం రాత్రులు నిద్రలేకుండా కరకట్టపైనే కాపలకాశారు.
- ఈ వరదలకు వెల్లటూరు-పెనుమూడి మధ్య పలుచోట్ల గండ్లు పడేపరిస్థితి రావడంతో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, అధికారులు రాత్రిళ్లు పొక్లెయినర్ల సాయంతో యుద్ధ ప్రాతిపదికన కరకట్టను పటిష్టం చేశారు. దీంతో గండ్లు పడకుండా పెను ప్రమాదాన్ని ఆపగలిగారు.

'త్రి'కరణ శుద్ధిగా మంత్రులు దృష్టి సారించాలి

ఎగువ కరకట్ట అత్యవసర పనులను ప్రభుత్వం ఆమోదించి, టెండర్లు పిలవడానికి సిద్ధమైంది. కరకట్ట దిగువనున్న నియోజకవర్గాల్లో ఒక కేంద్రమంత్రితోపాటు, ముగ్గురు రాష్ట్ర మంత్రులు ఉన్నారు. వీరు తలచుకుంటే నిధుల మంజూరు పెద్ద సమస్యే కాదు. కృష్ణా నది కరకట్ట తాడేపల్లి నుంచి పెదకోడూరు వరకు మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్, అక్కడి నుంచి కొల్లిపర మండలం వరకు మంత్రి నాదెండ్ల మనోహర్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఆ దిగువున మొత్తం రేపల్లె ఎమ్మెల్యే, మంత్రి అనగాని సత్యప్రసాద్ పరిధిలో ఉంది. వీరంతా కీలక మంత్రులే కావడంతో దిగువ కరకట్టకు కూడా ఈ ఏడాదిలో మోక్షం లభిస్తుందన్న ఆశాభావాన్ని నీటిపారుదల శాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు నదిలోనూ గ్రాయిన్స్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీనికోసం కూడా మంత్రులు శ్రద్ధ చూపితే నదీ పరివాహక ప్రాంతం సురక్షితంగా ఉంటుంది.

30 వేల మందిని అక్షరాస్యులను చేయాలి

రెండో దశలో పట్టణ అక్షరాస్యతపై దృష్టి

ఉల్లాస్ సమీక్ష సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ (అందరికి అక్షరాస్యత) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొదటి దశలో 10,707 మందిని అక్షరాస్యులుగా మార్చామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. రెండవ దశలో 30 వేల మందిని విధాన, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యులుగా తయారు చేయాలని అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ సమావేశ మందిరంలో ఉల్లాస్ పథకంపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొదటి ఫేజ్‌లో కేవలం గ్రామీణ ప్రాంతాల్లో వయోజన విద్యా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, రెండవ ఫేజ్‌లో పట్టణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులను గుర్తించి, తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు మున్సిపాలిటీల్లో ఉల్లాస్ సమన్వయ కమిటీలు ఏర్పాటుచేయాలని చెప్పారు. సెర్ప్, మెప్మా లబ్ధిదారులు, జెడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాల్లోని బోధనేతర సిబ్బంది, అంగన్‌వాడీ సహాయకులు, ఉపాధి హామీ కూలీల్లో నిరక్షరాస్యులను గుర్తించి, నమోదు చేయాలన్నారు. విద్యా వలంటీర్ నియామకాలు చేపట్టి.. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో తరగతులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ రాయడం, చదవడం, ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకునేలా శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి జగన్ మోహనరావు, డీఈఓ ఎల్.చంద్రకళ, డీఆర్డీఏ పీడీ ఝాన్సీ రాణి, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పిడుగురాళ్ల ఏఎంసీ చైర్మన్‌గా వీరస్వామి



పిడుగురాళ్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ఎన్టీఆర్ వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బీసీ సామాజికవర్గానికి చెందిన తు రకా వీరస్వామిని నియమిస్తూ రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు బుధవారం సాయంత్రం జీవో జారీచే శారు. గురజాల నియోజకవర్గ పరిధి లో ప్రధాన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన తురకా వీరస్వామి 1992 నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. ఆయన మండల కన్వీనర్‌గా, 2005లో పిడు గురాళ్ల నగర పంచాయతీ ఫ్లోర్‌లీ డర్‌గా పనిచేశారు. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. పిడుగు రాళ్ల ఏఎంసీ చైర్మన్‌గా నియమి తులైన వీరాస్వామికి పలువురు అభినందనలు తెలిపారు. వీరస్వామి నియామకంతో నియోజకవర్గంలో వడ్డెర సామాజికవర్గానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రాధాన్యం కల్పించడంపై ఆయా వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ముస్లిం గురుకులానికి వీడిన గ్రహణం

● ప్రారంభమైన భవనాల నిర్మాణ పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీ విద్యార్థుల గురుకుల పాఠశాల నిర్మాణానికి పట్టిన గ్రహణం వీడింది. 'పడని ముందడుగు.. గురుకులానికి తొలగని గ్రహణం' శీర్షికతో ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో వెలవడిన కథనంపై ప్రభుత్వం స్పందించింది. పాఠశాల భవనాల నిర్మాణ పనులను ప్రారంభించింది. ముస్లిం మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమాన్ని గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల గాలికొదిలేసింది. నరసరావుపేట మండలం పెదతురకపాలెంలో చేపట్టిన ముస్లిం మైనార్టీ విద్యార్థుల రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం నిలిపివేసింది. అయితే జిల్లాలో ముస్లిం మైనార్టీల విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టారు. రూ.18 కోట్ల వ్యయంతో తరగతి గదులు, వసతి గృహం, స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణం చేపట్టడం జరిగింది. 40 శాతం పనులు టీడీపీ హయాంలోనే పూర్తయాయి. ఆ పనుల విలువ సూమారు రూ.6.50 కోట్లు ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులను పూర్తిగా నిలిపివేశారు. మళ్లీ కూటమి ప్రభుత్వం స్కూల్ నిర్మాణాన్ని పట్టాలెక్కించింది. 2026 విద్యా సంవత్సరంలో వినియోగంలోకి తీసుకొచ్చే దిశగా పనులను వేగవంతం చేసింది.



ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో వెలువడిన కథనం



పెద తురకపాలెంలో ప్రారంభమైన ముస్లిం గురుకుల పాఠశాల భవనాల పనులు

7

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

◆ 2న అమరావతికి నరేంద్రమోదీ రాక
◆ శంకుస్థాపనల కంటే ముందు రోడ్ షో
◆ పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

రేవులోకి వస్తే.. లేపేస్తాం

◆ కృష్ణా జిల్లా వాడివి ఎలా వస్తావ్
◆ గింజుపల్లి రేవులో పడవ పాటదారుడికి బెదిరింపులు
◆ కలెక్టర్, ఎస్పీ, జడ్పీ అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

హైడ్రో గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

● రూ.7.5 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ఆర్గానిక్ పంటలకు ప్రోత్సాహం

● ఆర్గానిక్ ప్రొడక్ట్ అథారిటీ చైర్మన్ దేవదత్

అకాల వర్షాలతో అగచాట్లు

◆ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో వర్షాలు ◆ కల్లాల్లో తడిచిన మిరప, మొక్కజొన్న ◆ కూలిన భారీ వృక్షాలు

నరసరావుపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు అన్నదాతలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఈదురు గాలులతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాన పడింది. గాలుల ధాటికి భారీ వృక్షాలు నేల కూలాయి. ప్రస్తుతం మిరప, మొక్కజొన్న పంటలు కల్లాల్లోనే ఉన్నాయి. వర్షాలకు పంటలను కాపాడు కునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతు న్నారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటన రైతులను కలవరపరుస్తోంది. దాదాపు 10 మండలాల్లో అక్కడక్కడా వర్షాలు పడ్డాయి. ఈదురు గాలులకు కల్లాల్లో ఆరబోసిన పంట లు.. కప్పిన పట్టలు లేచిపోయి తడిచిపోతున్నాయి. రైతులు రాత్రిళ్లు కూడా కల్లాల వద్దే పంటకు కాపలాగా నిద్రిస్తున్నారు. నరసరావుపేట, నాదెండ్ల, అమరావతి, సత్తెనపల్లి, క్రోసూరు, నూజెండ్ల, పెదకూరపాడు, బొల్లాపల్లి, ముప్పాళ్ళ, వినుకొండ, యడ్లపాడు, శావల్యాపురం తదతర మండలాల్లో వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ తెలిపింది.



వర్షానికి తడిచిన మిరపను ఆరబెడుతున్న రైతు



నరసరావుపేట గుంటూరు రోడ్డుపై కూలిన భారీ చింత చెట్టు



గిల్టు నగలు మన్నిక కోసం ఇలా చేయాలి..!

మారుతున్న ఫ్యాషన్ ట్రెండ్స్‌కు అనుగుణంగా ప్రస్తుతం రకరకాల గిల్టు నగలు అందుబాటులో ఉన్నాయి. చీర, గౌను, ట్రెండీ డ్రెస్ ఇలా ఏ అవుట్‌ఫిట్ మీదనైనా చక్కగా అమరుతాయి ఈ నగలు. తక్కువ బరువుతో సౌకర్యవంతంగా అనిపిస్తాయి. అందుకే మహిళలు వీటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఎంతో ముచ్చట పడి కొనుక్కున్న గిల్టు నగలను ధరించేటప్పుడు చిన్న చిట్కాలు పాటిస్తూ సరైన పద్ధతిలో భద్ర పరచుకుంటే అవి ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. ఆ వివరాలు తెలుసుకుందాం...

- గిల్టు నగలకు తడి తగిలితే అవి బంగారు మెరుపును కోల్పోతాయి. అందుకే గొలుసులు, హారాలు, నెక్లెస్‌లు, గాజులు, ఉంగరాలను స్నానం చేసేటప్పుడు తీయడం మంచిది. చేతులు కడుక్కునేటప్పుడు కూడా వాటికి తడి తగలకుండా చూసుకోవాలి.
- మేకప్ ఉత్పత్తులు, మాయిశ్చరైజర్, పర్‌ఫ్యూమ్, లోషన్, డియోడరెంట్‌లు వాడేముందు గిల్టు నగలు ధరించకూడదు. అలా చేస్తే ఈ ఉత్పత్తుల్లోని రసాయనాల వల్ల నగలకు ఉన్న గోల్డ్ ప్లేటింగ్ తొలగిపోయి అవి నల్లబడే అవకాశం ఉంటుంది. మేకప్ పూర్తయి పర్‌ఫ్యూమ్ చల్లుకున్న అయిదు నిమిషాల తరవాతనే గిల్టు నగలు ధరించడం మంచిది.
- వేసవికాలంలో ఎక్కువగా చెమట పట్టే సమయాల్లో ఈ నగలు వేసుకోవద్దు. చెమట తగిలితే నగలు నలుపుతిరుగుతాయి.
- దుస్తులు ధరించిన తరవాతనే నగలు వేసుకోవాలి. లేదంటే దుస్తులకు ఉండే దారాలు, పోగులు పట్టుకుని నగలు విరిగిపోవచ్చు. నగల్లో ఉండే రాళ్లు, పూసలు రాలిపోవచ్చు.
- ఒకసారి ధరించిన నగలను భద్ర పరచేముందు వాటిని వెల్వెట్ వస్త్రం లేదా పలుచని కాటన్ గుడ్డతో మెల్లగా తుడవాలి. నగలకు అంటుకున్న చెమట, దుమ్ము లాంటి వాటిని పూర్తిగా తొలగించాలి. లేదంటే నగలు మెరుపును కోల్పోయి పాత బడతాయి.
- గిల్టు నగలను అన్నింటినీ ఒకే బాక్సులో పెట్టకూడదు. అలా పెడితే ఒకదానికి మరోటి రాసుకుని వాటి మీద గీతలు పడతాయి. మెరుపుదనం తగ్గుతుంది. నగలను వాటికి నిర్దేశించిన బాక్సుల్లో మాత్రమే జాగ్రత్త చేయాలి.
- ఈ నగలను గాలి, వెలుతురు చొరబడని పెట్టె లేదా సంచిలో పెట్టి ఉంచితే ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. పలుచని గుడ్డలో చుట్టి పెడితే వాటి మెరుపుదనం చాలాకాలం వరకూ నిలిచి ఉంటుంది.

అభిరుచి

ప్రపంచమంతా చుట్టేయాలని ఎవరికి ఉండదు!
కానీ ఎంతమందికి అది సాధ్యమవుతుంది?
అందుకే ఈ జంట విభిన్నంగా ఆలోచించింది.
పర్యాటక ప్రదేశాల సందర్శన కోసం ఇంటినే వదిలేసింది.
దానికి పెట్టే అద్దె డబ్బులతో... నిరంతరం పర్యటనల్లోనే గడుపుతోంది.
దీని వెనుక ఉన్న కథ ఏంటో జంటలో ఒకరైన **హేమని చావ్డా** మాటల్లోనే...

జగమంత కుటీరం మాది



"చదువుకొనే రోజుల్లో మార్కుల రేసులు... పోటీ పరీక్షలు... ఆ తరువాత వృత్తిపరమైన ఎదుగుదల కోసం అలుపెరుగని ప్రయత్నాలు... సగటు మనిషి జీవితం ఇదే కదా. చిన్నప్పటి నుంచీ చూసి చూసి విసుగెత్తిపోయాను. అందరిలా కెరీర్ వెంట పరుగెత్తడం... ఊహ తెలిసినప్పటి నుంచీ దాని కోసమే ప్రణాళికా రచనలో మునిగిపోవడం... డిగ్రీ చదివే రోజుల్లోనే జీవితం అంటే ఇది కాదనిపించింది. ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయ్‌పూర్ మాది. మూస ఉద్యోగాలకు భిన్నంగా చదువు అవ్వగానే ఆర్జేగా కెరీర్ ప్రారంభించాను. అందులో ఊహించినంత కిక్ దొరకలేదు. దాంతో ట్రావెల్ బ్లాగర్‌గా మారాను. తరచూ కొత్త ప్రాంతాలకు వెళ్లడం, అక్కడి ప్రత్యేకతలను సామాజిక మాధ్యమాల్లో అందరితో పంచుకోవడం... చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా అనిపించింది. దాంతో ఆర్జేగా స్వస్తి చెప్పి ట్రావెల్ బ్లాగింగ్‌కు పూర్తి సమయం కేటాయించాలని అనుకున్నాను.

ఆయనదీ అదే దారి...

ఇక నా భర్త సాగర్ పటేల్‌కు కూడా పర్యటనలంటే చాలా ఇష్టం. ఆయన సొంతూరు మధ్యప్రదేశ్‌లోని ఝబువా. భౌగోళిక సమాచార రంగంలో పని చేసేవారు. మా ఇద్దరినీ కలిపింది మా అభిరుచే. ఆయన ఆధ్యాత్మిక పర్యాటకంపై వీడియోలు చేసి ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌ల్లో అప్‌లోడ్ చేసేవారు. నేనేమో పిల్లా పెద్ద అందరూ కలిసి ఆస్వాదించే ప్రాంతాలను చుట్టివచ్చేదాన్ని. అనుకోకుండా ఇద్దరం ఒక ఊరు వెళ్లినప్పుడు కలిశాం. ముందు అభిరుచులు కలిశాయి. తరువాత మనసులు ముడిపడ్డాయి. రెండున్నరేళ్ల కిందట ఇద్దరం పెళ్లి చేసుకున్నాం. అప్పటివరకు విడివిడిగా పర్యటించిన మేము... పెళ్లి తరువాత నుంచి ఎక్కడికైనా కలిసి వెళుతున్నాం. మా వృత్తుల కంటే ఇలా విహరించడమే మాకు బాగా నచ్చింది. అందుకే ట్రావెల్ బ్లాగింగ్‌కే పూర్తి స్థాయి సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నాం.

ఇల్లు ఖాళీ చేసి...

అంతకుముందు మేమిద్దరం అహ్మదాబాద్‌లోని ఓ అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. నెలకు అద్దె 40 వేలు. మెయింటెనెన్స్, పని మనిషి, కరెంటు... మరో పది వేలు అయ్యేవి. ఇవి కాకుండా సరుకులు, ఇతర నిత్యావసర వస్తువులు...అన్నీ కలుపుకొంటే దాదాపు లెక్క లక్ష తేలేది. ఇంతా చేసి నెలలో కనీసం ఓ వారం రోజులు కూడా మేం ఇంట్లో ఉండేవాళ్లం కాదు. పెళ్లయ్యాక మొదటి ఏడాదంతా జీవితంలో స్థిరపడాలనే ప్రయత్నాలతోనే సరిపోయింది. దాని కోసం ఎన్నో ప్రణాళికలు. లేచింది మొదలు మెదడులో ఇవే తిరుగుతుండేవి. ఇలాంటి జీవితం కాదు కదా నేను కోరుకున్నది! ఒక రోజు కూర్చొని ఆలోచిస్తుంటే... ఇద్దరి దారి, గమ్యం ఒకటే అయినప్పుడు ఇవన్నీ అవసరమా అనిపించింది. నెల తిరిగే సరికి ఇంత ఖర్చు భరించడం అంటే... తెలియకుండానే మాపై ఆర్థికంగా, మానసికంగా ఒత్తిడి పెరుగుతోంది. దీనివల్ల చేసే పని మీద ఏకాగ్రత కుదరడం లేదు. అన్నీ బేరీజు వేసుకున్నాక... ఇల్లు ఖాళీ చేయాలనే నిర్ణయానికి వచ్చాం. మాకున్న కొద్దిపాటి సామాను అత్తగారి ఇంట్లో పెట్టాం.

అద్దె డబ్బుతో...

ఇకపై పూర్తిగా పర్యటనల్లోనే గడపాలని ఇద్దరం అనుకున్నాం. అలా ఐదు నెలల కిందట ఇల్లు ఖాళీ చేసేశాం. అప్పటి నుంచి నిరంతరాయంగా ఊళ్లు తిరుగుతున్నాం. ఇప్పుడు మాకంటూ ఒక ఇల్లు లేదు. మేం ఎక్కడికి వెళితే అక్కడే మా నివాసం. ఎలాంటి బరువు, బాధ్యతలూ లేవు. నెల నెలా మేం కట్టే అద్దె డబ్బులతో నచ్చిన ప్రాంతాలన్నీ సందర్శిస్తున్నాం. 'మేం ఇలా గడపాలనుకున్నాం' అని మా పెద్దవాళ్లను కూడా ఒప్పించాం. అప్పుడప్పుడూ వారిని కూడా మాతో తీసుకువెళుతుంటాం. కొన్ని ఊళ్లకు తరచూ వెళుతుండంవల్ల స్థానికులతో పరిచయాలు ఏర్పడ్డాయి. దానివల్ల కొన్నిసార్లు కొత్త ప్రాంతానికి వెళ్లిన అనుభూతి కలగదు. అంతా మనవాళ్లే అనిపిస్తుంది. అలాగే బయటివారి కంటే తక్కువ ధరకే వసతి దొరుకుతోంది. మా ప్రయాణ ఖర్చులు, అక్కడి హోటల్‌లో బస, భోజనం... అన్నీ కలుపుకొంటే మేం కట్టిన అద్దె డబ్బు కంటే మించడంలేదు. సరుకులు కొనాల్సిన అవసరం లేదు. ఇద్దరికీ కలిపి ఒక సూట్‌కేస్, ఒక బ్యాక్‌ప్యాక్. ఇదే మా సంసారం.

ప్రయోగాత్మకంగా...

మేం మొదలుపెట్టినప్పుడు ఎన్ని రోజులు కొనసాగిస్తామో తెలియదు. ప్రయోగాత్మకంగా ఏడాది పాటు ఇలా చేసి చూద్దామని అనుకున్నాం. ఐదు నెలలు గడిచిపోయాయి. రోజు రోజుకూ ఉత్సాహం, ఆసక్తి పెరుగుతున్నాయే కానీ తగ్గడంలేదు. కుదిరితే జీవితాంతం ఇలా పర్యటనల్లోనే గడిపేయాలని కోరుకొంటున్నాం. పర్యటిస్తూనే మేం సంపాదించుకొంటున్నాం. వెళ్లదలుచుకున్న చోట రెస్టారెంట్లు, దర్శనీయ స్థలాల నిర్వాహకులను సంప్రతిస్తాం. వారు కోరితే వాటికి ప్రచారం కల్పిస్తాం. వారి సామాజిక మాధ్యమాల ఖాతాలను నిర్వహిస్తాం. సాంకేతికంగా మాకు మంచి నైపుణ్యం ఉంది. ఈ సేవలకు గానూ వారు మాకు కొంత మొత్తం చెల్లిస్తారు. రెస్టారెంట్లు, కేఫ్‌ల్లో తాత్కాలికంగా హెల్పర్‌గా పని చేస్తాం. ఇవే మా ఆదాయ మార్గాలు.



లక్షల్లో ఫాలోవర్స్...

ప్రస్తుతం మేం తీసే వీడియోలన్నీ నా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తున్నాం. అక్కడ నాకు దాదాపు మూడున్నర లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ట్రావెల్ బ్లాగింగ్‌ను ఫుల్‌టైమ్ కెరీర్‌గా మార్చుకున్నాక ఫాలోవర్స్ విపరీతంగా పెరిగారు. మా ఆలోచనకు అభినందనలు తెలుపుతున్నారు. 'మీది సాహసోపేత నిర్ణయం' అంటూ పొగుడుతున్నారు. ఆ కామెంట్లు చూసినప్పుడు... 'ఇల్లు, కెరీర్‌ను వదిలేసి కొత్త మార్గంలో పయనిస్తున్నామంటే... నిజంగానే మాది సాహసమే కదా' అనిపిస్తుంది. అయితే జీవితం మొత్తాన్నీ ఒక సూట్‌కేసులో పెట్టేసి జీవించడమంటే అంత సులువు కాదు. కానీ ఒక్కటి నిజం... లగేజీ ఎంత తక్కువ ఉంటే ప్రయాణం అంత సౌకర్యంగా ఉంటుంది. ఏదిఏమైనా మా పర్యాటక అభిరుచిని జీవితాంతం కొనసాగించాలన్నదే మా ధ్యేయం. ఎందుకంటే ఇలాంటి అద్భుత అవకాశం అందరికీ రాదు కదా."



ఆరాధ్యుల వెంకటేశ్వరరావు, గుర్రాల రవికృష్ణలకు పురస్కారాలు అందజేస్తున్న మంత్రి దుర్గేశ్

సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరిస్తాం

- సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేశ్
- నాటక రంగంలో 113 మందికి 'కందుకూరి' పురస్కారాలు

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కళలు, సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరిస్తామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. కందుకూరి 177వ జయంతి సందర్భంగా ఏపీ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం 'తెలుగు నాటక రంగ దినోత్సవం-2025' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గేశ్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నాటకానికి ఓ ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించి, నాటకానికి సామాజిక ప్రయోజనం ఉండాలని విశ్వసించిన రచయిత వీరేశలింగం పంతులు అని కొనియాడారు. తెలుగులో మొట్టమొదటి నాటకం రాసిన కందుకూరిని నాటకరంగ ఆద్యుడుగా అభివర్ణించారు. నాటక రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 113 మందికి మంత్రి అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. రాష్ట్రస్థాయిలో ముగ్గురికి కందుకూరి ప్రతిష్ఠాత్మక రంగస్థల పురస్కారాలు, జిల్లాస్థాయిలో 110 మందికి కందుకూరి విశిష్ట పురస్కారాలను అందజేశారు.

సచివాలయం, ఐకానిక్ టవర్ల నిర్మాణానికి టెండర్లు

- మే 1న టెక్నికల్ బిడ్లను తెరవనునన్న సీఆర్డీఏ

విజయవాడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అమరావతిలో నిర్మించతలపెట్టిన సచివాలయం, జీఏడీ ఐకానిక్ టవర్ల నిర్మాణానికి సీఆర్డీఏ టెండర్లు పిలిచింది. సచివాలయం కోసం 4 టవర్లు, జీఏడీ టవర్‌కు వేర్వేరుగా టెండర్ నోటిఫికేషన్లు ఇచ్చింది. మొత్తంగా రూ.4,668 కోట్లతో 5 టవర్లను డయాగ్రిడ్ మోడల్‌లో నిర్మించనున్నారు. సచివాలయ 4 టవర్లను బేస్‌మెంట్+39 ఫ్లోర్లు+టెర్రస్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో 1, 2 టవర్లను 28,41,675 చదరపు అడుగుల విస్తీర్ణం, 3, 4 టవర్లను 23,42,956 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించనున్నారు. సీఎం కార్యాలయం ఉండే కీలకమైన జీఏడీ టవర్‌ను బేస్‌మెంట్+47 ఫ్లోర్లు+హెలిప్యాడ్‌తో కలిపి మొత్తం 17,00,3000 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. జీఏడీ టవర్ నిర్మాణానికి రూ.1,126 కోట్లు, సచివాలయం ఒకటి, రెండు టవర్ల నిర్మాణానికి రూ.1,897 కోట్లు, సచివాలయం టవర్ల కోసం రూ.1,664 కోట్లతో వేర్వేరుగా టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. మే 1వ తేదీన సచివాలయం, జీఏడీ టవర్ల టెక్నికల్ బిడ్లను సీఆర్డీఏ తెరవనుంది.

పవన్ కల్యాణ్, మార్క్ శంకర్‌పై అసభ్య పోస్టులు
పోలీసుల అదుపులో కర్నూలు జిల్లా వాసి

- నిందితుడు అల్లు అర్జున్ అభిమానిగా గుర్తింపు

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన కుమారుడు మార్క్ శంకర్‌పై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన కేసులో కర్నూలు జిల్లా గూడూరుకు చెందిన పుట్టపాశం రఘు అలియాస్ పుష్పరాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు.. ప్రత్తిపాడుకి చెందిన సాంబశివరావు ఫిర్యాదు మేరకు రఘుని రెస్టు చేశామన్నారు. రఘు.. అల్లు అర్జున్‌కు వీరాభిమాని అని తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో అర్జున్ నంద్యాలకు వచ్చి వైసీపీ అభ్యర్థికి మద్దతు తెలిపారు. దీంతో మెగా అభిమానులు అర్జున్‌ని విమర్శించారు. దీంతో రఘు.. మెగా కుటుంబంలోని వ్యక్తులపై అసభ్యకర పోస్టులు పెట్టేవాడని ఎస్పీ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 8న పవన్ కల్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్‌కు సింగపూర్‌లో అగ్ని ప్రమాదం జరిగిందని, ఇదే అదునుగా మెగా కుటుంబంపై ద్వేషాన్ని వెళ్లగక్కుతూ అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేశాడని తెలిపారు.

విశాఖ కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ పనులు ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారయ్యాయి. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేయడం ఒడిశాలోని తూర్పు కోస్తా జోన్ అధికారులకు అది నుంచీ ఇష్టం లేదు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా ఆ రాష్ట్రానికి చెందిన వారే కావడంతో వారు అనుకున్నట్టుగానే చేస్తున్నారు. దీంతో గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.



విశాఖ రైల్వే జోన్‌కు గెజిట్ ఏదీ?

ఒడిశా అధికారుల మోకాలడ్డు

- కొత్తవలసను కూడా రాయగడ
- డివిజన్‌లో చేర్చాలని డిమాండ్
- మళ్లీ ఆగిన జోనల్ ఆఫీస్ పనులు
- ఉమ్మడి జిల్లాలో రైల్వే స్టాండింగ్
- కమిటీ ఛైర్మన్ ఉన్నా ప్రయోజనం నిల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ రైల్వే జోన్ ప్రకటించిన తర్వాత విశాఖలో కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి ఏళ్ల సమయం పట్టింది. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడ్డాక రైల్వే జోన్‌కు అవసరమైన భూ వివాదాలు పరిష్కరించి అధికారికంగా ముడసర్లోవలో 52 ఎకరాలు అప్పగించింది. దీనిలో కార్యాలయ సముదాయం నిర్మాణానికి ఈ ఏడాది జనవరి 8న ప్రధాని నరేంద్రమోదీ చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. రైల్వే జోన్ భవన నిర్మాణానికి రూ.149 కోట్లతో టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్ అక్కడ పనులు ప్రారంభించగా వివాదాలు మొదలయ్యాయి. ఆ భూమి తమదంటూ కొందరు గిరిజనులు పనులను అడ్డుకున్నారు. దీంతో ఎక్కడి యంత్రాలు అక్కడే ఆగిపోయాయి. వైసీపీ హయాంలోనూ గిరిజనులు ఇలాగే అడ్డుపడ్డారు. వారికి ఆ భూములపై హక్కులు లేవని అధికారులు నిర్ధారించారు. అయితే, తాము చాలా కాలంగా ఇక్కడే జీవిస్తున్నామని, ప్రత్యామ్నాయం చూపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సొంత భవనంతో సంబంధం లేకుండా రైల్వే జోన్‌ను ఆపరేషన్ చేసుకునే అవకాశం ఉంది. వాస్తవానికి రైల్వేలో ఏదైనా కొత్త జోన్ ఏర్పాటు చేసినప్పుడు దానికి సంబంధించి అధికారికంగా ఒక గెజిట్ విడుదల చేస్తా రు. దీనిలో న్యాయపరమైన అంశాలు ఉంటాయి. జోన్ పరిధి, హద్దులు, ఆపరేషన్ తేదీ, తదితర వివరాలు పేర్కొంటారు. గతంలో అన్ని జోన్లకు గెజిట్ ప్రకటించాకే పనులు ప్రారంభించారు. విచిత్రంగా విశాఖలోని దక్షిణ కోస్తా జోన్‌కు మాత్రం ఇప్పటివరకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వలేదు. 3 నెలలైనా దాని గురించి ఎవరూ ప్రశ్నించడం లేదు. జోనల్ కొత్త కార్యాలయం నిర్మాణం రెండేళ్లలో పూర్తిచేయాలని నిబంధన పెట్టారు. కానీ, మూడు నెలలైనా అక్కడ మొక్కలు కూడా తొలగించలేదు. గెజిట్‌లో 'ఆపరేషన్ డేట్' ప్రకటిస్తే దాని ప్రకారం రైల్వే అధికారులు పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ, ఉద్దేశపూర్వకంగా గెజిట్ ప్రకటించకుండా తొక్కి పెట్టారు.

కొత్తవలస కావాలని పేచీ

దక్షిణ కోస్తా జోన్ ప్రకటించిన సందర్భంలో వాల్తేరు డివిజన్‌ను విడగొట్టి కొత్తగా ఒడిశాలోని రాయగడ కేంద్రంగా మరో డివిజన్ ఏర్పాటు చేశారు. విజయనగరం జిల్లా కొత్తవలస నుంచి అరకు వరకు రాయగడ డివిజన్‌లో చేర్చారు. అయితే, తాజాగా కొత్తవలస స్టేషన్‌ను కూడా ఈ డివిజన్‌కే ఇవ్వాలని తూర్పు కోస్తా జోన్ అధికారులు భువనేశ్వర్ నుంచి ఒత్తిడి చేస్తున్నారు. దీనికి బలమైన కారణం ఉందన్న చర్చ సాగుతోంది. ఆ పరిసరాల్లో రైల్వే వ్యాగన్ డిపో త్వరలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దీంతో కొత్తవలస స్టేషన్ కూడా తమ పరిధిలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. అదయ్యాకే గెజిట్‌ను విడుదల చేయించాలనేది ఒడిశా నేతల ప్రణాళికగా ఉన్నట్టు సమాచారం.

మన నేతలు ఏం చేస్తున్నట్టు?

రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేసేశాం కాబట్టి తమ పని అయిపోయిందని ఉత్తరాంధ్రకు చెందిన నాయకులు భావిస్తున్నారు. అనకాపల్లి ఎంపీగా ఉన్న సీఎం రమేశ్ సాక్షాత్తూ రైల్వే స్టాండింగ్ కమిటీకి ఛైర్మన్. ఆయన దీనిపై దృష్టి పెడితే రెండు రోజుల్లో గెజిట్ నోటిఫికేషన్ ఇప్పించే అవకాశం ఉంది. ఉత్తరాంధ్రాలోనే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఉన్నారు. ఆయన ఢిల్లీ పెద్దలతో మాట్లాడినా గెజిట్ విడుదల అవుతుంది. ఆ దిశగా దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

లైవ్‌లో అశ్లీల వీడియోలు

- నిషేధిత వెబ్‌సైట్‌కు అమ్ముతున్న ముఠా
- బెంగళూరు కేంద్రంగా ఇద్దరు.. గుంతకల్లులో మరొకరు దందా
- పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్న ఈగల్ చీఫ్ రవికృష్ణ

గుంటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నిషేధిత అశ్లీల వెబ్‌సైట్‌లో మహిళల నగ్న వీడియోలు ప్రత్యక్ష ప్రసారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్న ముగ్గురి గుట్టురట్టయింది. రెండేళ్లుగా ఈ అశ్లీల దందా నిర్వహిస్తున్న శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన గణేశ్, జ్యోత్స్న, గుంతకల్లుకు చెందిన లూయిస్‌లను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం వారిని మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. వారి దందా వివరాలను ఈగల్ చీఫ్, సైబర్ క్రైమ్ ఇన్‌చార్జ్ ఐజీ ఆకే రవికృష్ణ గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో వివరించారు. గణేశ్, జ్యోత్స్న డిగ్రీ చదువుకొని సులువుగా డబ్బు సంపాదించే మార్గాలను అన్వేషించారు. బెంగళూరు కేంద్రంగా సైప్రస్ దేశానికి చెందిన నిషేధిత ఎక్స్‌హ్యామ్‌స్టర్ వెబ్‌సైట్ ద్వారా మహిళల నగ్న వీడియోలను లైవ్ స్ట్రీమింగ్ చేస్తున్నారు. గుంతకల్లులో కాల్ సెంటర్ నిర్వహిస్తున్న లూయిస్ అనే వ్యక్తి కూడా ఈ అశ్లీల వీడియోల దందా నిర్వహిస్తున్నాడు. ఈ ముగ్గురికి వెబ్‌సైట్ నిర్వాహకులు క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్‌లో చెల్లింపులు చేస్తే.. వాటిని డాలర్లలోకి, ఆపై రూపాయల్లోకి మార్చుకుంటున్నారు. ఇప్పటి వరకు బెంగళూరుకు చెందిన ముఠా రూ. 16 లక్షలు, లూయిస్ రూ. 11 లక్షలు సంపాదించారని పోలీసుల విచారణలో తేలింది. తమకు అందిన సమాచారం మేరకు సీఐడీ సైబర్ క్రైమ్ ఎస్పీ కృష్ణ ప్రసన్న ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బెంగళూరులోని గణేశ్, జ్యోత్స్న స్టూడియోపై దాడి చేసి లైవ్ స్ట్రీమింగ్ పరికరాలు, వెబ్ కెమెరాలు, పోర్న్ వీడియోల డేటా సీజ్ చేశారు. ఇక్కడ ప్రస్తుతానికి ముగ్గురు మహిళా బాధితులను గుర్తించారు. ఈ ముఠాపై ఇప్పటివరకు మూడు ఫిర్యాదులు నమోదయ్యాయని, దర్యాప్తు కొనసాగుతోందని, ఎంత మంది బాధితులు ఉన్నారనేది త్వరలోనే తెలియజేస్తామని ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సైబర్ క్రైమ్ బాధితులు 1930కు ఫిర్యాదు చేయొచ్చు

ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆకే రవికృష్ణ సూచించారు. ఇటీవల బెట్టింగ్ యాప్స్, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ ఫ్రాడ్ తదితర ఆర్థిక నేరాలు జరుగుతున్నాయన్నారు. అందువల్ల వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించి 1930 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. న్యాయం జరగని పక్షంలో మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయానికి రావచ్చన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టు పెడితే పదేళ్ల తరువాత అయినా అరెస్టు కాక తప్పదని హెచ్చరించారు. యువత డ్రగ్స్, గంజాయి వంటి మాదక పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాటిపై ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా 1972 అనే టోల్ ఫ్రీ నంబర్ ఉందన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులను విక్రయించవద్దని మందుల షాపులకు సూచించారు. తల్లిదండ్రులూ పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్పీ కృష్ణ ప్రసన్న, డీఎస్పీ గోలి లక్ష్మయ్య పాల్గొన్నారు.


మూడేళ్లలో ఏపీ పోలీసుల్లో 33% మహిళలు

- మిగతా రాష్ట్రాలు 24 ఏళ్లకు గానీ కోటా చేరుకోలేవు
- ఇండియా జస్టిస్ నివేదిక-2025 వెల్లడి

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థలో మహిళా రిజర్వేషన్ కోటా 33 శాతాన్ని ఇప్పటి వరకు ఏ రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతం కూడా సాధించలేదని ఇండియా జస్టిస్ నివేదిక-2025 వెల్లడించింది. మరో మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో 33 శాతానికి చేరుకుంటుందని తెలిపింది. అదే సమయంలో మిగతా రాష్ట్రాలు ఈ కోటాను పూర్తిగా అమలు చేయడానికి కనీసం మరో 24 ఏళ్ల అవుతుందని, జార్ఖండ్, త్రిపుర, అండమాన్-నికోబార్‌కు అయితే 200 ఏళ్ల పడుతుందని పేర్కొంది.

నివేదికలోని వివరాలు

- దేశవ్యాప్తంగా 17 శాతం పోలీసు స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు, 30 శాతం స్టేషన్లలో మహిళా హెల్ప్ డెస్క్‌లు లేవు.
- పోలీసు వ్యవస్థలో లింగ వివక్ష అధికంగా ఉంది. దేశవ్యాప్తంగా ఉన్నత స్థాయి పోస్టుల్లో ఉన్న మహిళలు 8 శాతం మాత్రమే. ఏపీలో జాతీయ సగటు కంటే కూడా తక్కువగా ఉంది. ఏపీలో సగటున పోలీసు స్టేషన్‌కు మహిళా ఎస్‌ఐలు 0.2 శాతం, మహిళా కానిస్టేబుళ్ల 2.5 శాతం మాత్రమే.
- ఏపీలో మొత్తం పోలీసు ఉద్యోగుల్లో మహిళలు 21.5 శాతం, పోలీసు అధికారుల్లో 5.2 శాతం, జైలు ఉద్యోగుల్లో 8.4 శాతం ఉన్నారు.
- న్యాయవ్యవస్థలో పెండింగ్ కేసుల సంఖ్య ఎక్కువగా ఉంది. బిహార్‌లో మూడేళ్ల నుంచి పెండింగ్ కేసులు 71 శాతం ఉన్నాయి.
- ఏపీలో కింది కోర్టుల్లో మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులు 33.5 శాతం. హైకోర్టులో ఐదేళ్ల నుంచి పెండింగ్ కేసులు 50.7 శాతం, 10-20 ఏళ్లలో పెండింగ్‌లో ఉన్నవి 26.7 శాతం, 20 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నవి 22.5 శాతం ఉన్నాయి.
- 10 లక్షల మంది ప్రజలకు 50 మంది జడ్జిలు అవసరం కాగా, ప్రస్తుతం 15 మంది జడ్జిలు మాత్రమే ఉన్నారు. ఏపీలో జడ్జి, ప్రజల నిష్పత్తి 10.5 శాతంగా ఉంది. ఇది 50 శాతం ఉండాలి.



- జిల్లా న్యాయస్థానాల్లో మహిళా జడ్జిలు 38 శాతం ఉన్నారు.
- ఏపీ హైకోర్టు జడ్జిల్లో మహిళలు 16.7 శాతం, సబ్ కోర్టుల్లో 50.9 శాతం ఉన్నారు.
- పోలీసు, న్యాయ వ్యవస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటాను అమలు చేసిన ఏకైక రాష్ట్రం కర్ణాటక.
- దేశవ్యాప్తంగా మహిళా పోలీసుల్లో 89 శాతం మంది కానిస్టేబుల్ స్థాయిలోనే ఉన్నారు.

ఆర్గానిక్ పంటలకు ప్రోత్సాహం

● ఆర్గానిక్ ప్రాడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ దేవదత్



సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ఆర్గానిక్ ప్రాడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ దేవదత్, చిత్రంలో డైరెక్టర్ డాక్టర్ యడ్లపల్లి సతీష్ తదితరులు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో ఆర్గానిక్ పంటలు పండించే వారికే మాత్రమే ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకాలు అందజేస్తుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ తెలిపారు. బుధవారం గుంటూరు లాం ఫాంలోని కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆయన ప్రసంగించారు. మొత్తం సాగు భూమిలో 35శాతం ఆర్గానిక్ పంటలు మాత్రమే పండించేలా లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లాలన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని క్రిమిసంహారక మందులు లేని పంటల సాగుకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు. మేలైన వ్యవసాయ పద్ధతుల ద్వారా రాష్ట్రంలో 1,977 మంది రైతులు 1,594 హెక్టార్ల విస్తీర్ణంలో పండించిన 5,549 మెట్రిక్ టన్నులు ఉత్పత్తులను అధిక ధరకు విక్రయించి లబ్ధి పొందారన్నారు. సమీక్షలో డైరెక్టర్ డాక్టర్ యడ్లపల్లి సతీష్, క్వాలిటీ మేనేజర్ డాక్టర్ యుగంధర్, జోనల్ ఆఫీసర్లు డాక్టర్ సారిక, డాక్టర్ మూల ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

● 2న అమరావతికి నరేంద్రమోదీ రాక
● శంకుస్థాపనల కంటే ముందు రోడ్ షో
● పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లుకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం



కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2న రాజధాని అమరావతిలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోదీ రాజధానిలో వివిధ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొననున్న దృష్ట్యా అందుకు తగిన ఏర్పాట్లను అధికారులు శ్రద్ధపెట్టి చేయాలన్నారు. ప్రధాని బహిరంగ సభలో పాల్గొనే ముందు రోడ్డు షో ఉంటుందని, అందుకు తగ్గ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి రూట్ ప్లాన్‌పై అధికారులందరు కూడా అవగాహన కలిగి ఉండి వాహనాల రాకపోకలు, ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. బ్యారికేడ్ పనులు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ సతీష్‌కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజనసింహా, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో ఖాజావలి, ఏఎస్పీ సుప్రజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, డ్వామా పీడీ శంకర్, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీఈవో రేణుక, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, డీపీవో వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ ప్రసాద్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సదుపాయాలను కల్పించాలి

● వీఏవోల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ముత్తినేని నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎం.నాగేశ్వరరావు, పాల్గొన్న సంఘ సభ్యులు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గతంలో ఉన్న సవరణ ఉత్తర్వులను రద్దు చేసి, వీఏవోలు అందరికీ పెన్షన్లు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ విశ్రాంత సంఘం, విశ్రాంత ఉద్యోగుల విభాగపు రాష్ట్ర అధ్యక్షుడు ముత్తినేని నాగేశ్వరరావు తెలిపారు. గుంటూరు, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో బుధవారం సంఘ కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. పదేళ్ల సర్వీసు ఉన్న వారికి సర్వీసు పెన్షన్, ఇతర సదుపాయాలను కల్పించాలని 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జీవోను జారీ చేసిందన్నారు. కాకపోతే పార్టటైమ్ సర్వీస్, వాలంటరీ పదవి విరమణకు పనికిరాదని కొందరు అభ్యంతరం తెలుపుతూ ఆ జీవోను అమలు జరపకుండా నిలిపివేశారని గుర్తుచేశారు. జీవోను అమలు చేయాలని ఎనిమిది ఏళ్ల నుంచి న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. కౌంటర్లు దాఖలు చేయాలని కోరుతూ ఈ మధ్య సీఎస్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టి సారించి, న్యాయ పోరాటానికి సహకరించి, పెన్షన్ సదుపాయాలను కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల రామదాసు, కోశాధికారి వాన కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, డీఈవో రేణుక తదితరులు

ఉప్పలపాడు జడ్పీ స్కూల్ విద్యార్థినికి వెయిట్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్

గుంటూరు(విద్య), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉప్పలపాడులోని జడ్పీ స్కూల్ విద్యార్థి జాతీయ స్థాయిలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపింది. ఈనెల 7వ తేదీ నుండి 12వరకు మణిపూర్‌లోని ఇంఫాల్‌నందు జరిగిన జాతీయ స్థాయి అండర్-17 విభాగంలో 76 కేజీల విభాగం వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఉప్పలపాడు జడ్పీ స్కూల్ విద్యార్థిని బిట్రా రోచిస్మితి కాంక్ష పతకం సాధించింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆమెను అభినందించారు. కార్యక్రమంలో డీఈవో రేణుక, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మెల్లంపూడి రవి ఉప్పలపాడు పీడీ సీహెచ్ వినయ్‌కుమార్, రాష్ట్ర పీడీ పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కరీముల్లారావు, జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీను, కోచ్, పీడీ శిరీష తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలి

● నోబుల్ టీచర్స్ అసోసియేషన్



పార్వతికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ నాయకులు

గుంటూరు (విద్య), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ కేడర్లలో జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావులు విజ్ఞప్తిచేశారు. ఈమేరకు బుధవారం పాఠశాల విద్య డైరెక్టర్ పి. పార్వతికి వినతిపత్రం అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులు వారి కుటుంబాలకు దూరంగా ఉన్నారని, వెంటనే వేసవి సెలవులలో బదిలీలు చేపట్టాలని కోరారు. అలాగే మోడల్ స్కూల్స్‌లో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు ఈ వేసవి సెలవులలో బదిలీలు చేపట్టాలని హైమారావు తదితరులు కోరారు.

జిల్లాకు 28 ఆధార్ కిట్ల మంజూరు

● డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ



సచివాలయాల సిబ్బందికి ఆధార్ కిట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ, మోహన్‌రెడ్డి తదితరులు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆధార్‌సేవలు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం గుంటూరు జిల్లాకు 28 ఆధార్‌కిట్లు మంజూరుచేసిందని జడ్పీ డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ తెలిపారు. ఒక్కో కిట్ విలువ రూ.1.80లక్షలు ఉంటుందన్నారు. ప్రతి కిట్‌లో ల్యాప్‌ట్యాప్‌తోపాటు, మరో 15 పరికరాలు ఉన్నాయని, కిట్లను జిల్లాలోని సచివాలయ సిబ్బందికి అందజేశామని తెలిపారు. ఆధార్ సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ఈ కిట్లను అందజేసిందన్నారు. కార్యక్రమంలో సచివాలయాల పర్యవేక్షకుడు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిత్రాల ప్రదర్శనను తిలకిస్తున్న రాష్ట్ర ఆర్ట్స్ క్రాఫ్ట్ శిల్పారామం చైర్ పర్సన్ మంజుల రెడ్డి

చిత్రకళా ప్రదర్శన ప్రారంభం

పెదకాకాని, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బి ఎఫ్ ఏ ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థుల రూపొందించిన చిత్రాల ప్రదర్శనను బుధవారం ఆర్ట్స్ క్రాఫ్ట్ శిల్పారామం రాష్ట్ర చైర్‌పర్సన్ సిహెచ్ మంజులా రెడ్డి ప్రారంభించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క చిత్రము ఒకదానికొక్కటి పోటీపడే విధంగా చిత్రీకరించారని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీ చెన్నకేశవుడి రథోత్సవం

మాచర్ల రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్లలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి 145వ రథోత్సవం గురువారం వైభవంగా జరగనుంది. ప్రతియేటా చైత్రశుద్ధ త్రయోదశి నుంచి 15రోజులపాటు మాచర్లలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. అందులో స్వామివారి కల్యాణం అనంతరం రథోత్సవం ప్రధానఘట్టం. సుమారు లక్షమంది వరకు ఈ వేడుకను కనులారా వీక్షించేందుకు హాజరవుతారు.

రాయగడ ఎక్స్‌ప్రెస్ కొద్ది రోజులపాటు విజయనగరం వరకే

గుంటూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్‌లో ఇంజనీరింగ్ పనుల కారనంగా నంబరు. 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 21, 28, మే 3వ తేదీన విజయనగరం వరకే ప్రయాణిస్తుందని గుంటూరు డివిజనల్ రైల్వే అధికారి సుదేష్ణ సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22, 29, మే 4వ తేదీన విజయనగరం నుంచి బయలుదేరి గుంటూరుకు ప్రయాణిస్తుందన్నారు. ఈ మార్పులను ప్రయాణీకులు గమనించాలని డీఆర్ఎం విజ్ఞప్తి చేశారు.

జీవో 35ని రద్దు చేయాలి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌లోని ఉద్యోగుల ప్రయోజనాలకు ఇబ్బంది కలిగించి, క్యాడర్‌లో తీవ్ర వ్యత్యాసాలకు కారణమైన జీఓ నెం.35ని వెంటనే రద్దు చేయాలని ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నేతలు కమిషనర్ ఎం కృష్ణతేజకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నేతలు బుధవారం పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం నేతలు మాట్లాడుతూ జీఓ 35 వల్ల ఏవోలకు ఎంపీడీఓల ప్రమోషన్‌లలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వం స్పందించి జీఓ రద్దుచేయని పక్షంలో ఉద్యమం చేపడతామని వెల్లడించారు.కార్యక్రమంలో ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం సలహాదారు బండి శ్రీనివాసరావు, అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్, జిల్లా నాయకులు డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, గుంటుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేవులోకి వస్తే.. లేపేస్తాం

● కృష్ణా జిల్లా వాడివి ఎలా వస్తావ్..
● గింజుపల్లి రేవులో పడవ పాటదారుడికి బెదిరింపులు
● కలెక్టర్, ఎస్పీ, జడ్పీ అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): 'కృష్ణా జిల్లా వాడివి.. ఇక్కడకు వచ్చి చేసేది ఏమిటి.. పాట రద్దు చేసుకుని వెళ్లిపో.. రేవులోకి వస్తే లేపేస్తాం.. ఎక్కడికి వెళ్లినా ఏమీ చేయలేవు.. మేము లోకల్.. నువ్వు నాన్ లోకల్..' అంటూ అచ్చంపేట మండలం గింజుపల్లి పడవ పాటదారుడికి స్థానికులు బెదిరింపులు. ఈ మేరకు బాధితుడు ఇప్పటికే కలెక్టర్, ఎస్పీ, జడ్పీ అధికారులకు ఫిర్యాదు చేశారు. రేవులోకి వస్తే లేపేస్తామని బెదిరిస్తుంటే సొమ్ము ఎలా చెల్లిస్తానని బాధితుడు జడ్పీ అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీంతో జడ్పీ అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. జడ్పీ ఆదాయానికి గండి కొట్టే విధంగా ప్రైవేటు వ్యక్తులు ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేస్తున్నారు. ఎటువంటి అనుమతి లేకుండానే గింజుపల్లి రేవులో పడవలు తిప్పుతున్న వారి వివరాలు సేకరించడంతో పాటు, పడవలను వెంటనే సీజ్ చేయాలని అచ్చంపేట ఎంపీడీవోను అధికారులు ఆదేశించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పడవ రేవుల కోసం ఇటీవల జడ్పీ పాటలు నిర్వహించగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదాయం సమకూరింది. గింజుపల్లి రేవుకు రూ.14 లక్షలు, రూ.13.90 లక్షలు, రూ.13 లక్షలతో ముగ్గురు ముందుకు రాగా స్థానికుల బెదిరింపులకు భయపడి ఇద్దరు రేవులోకి వెళ్లేందుకు సాహసించలేదు. ఈ నేపథ్యంలో మూడో వ్యక్తికి రేవును అప్పగించేందుకు అధికారులు సిద్ధపడినట్లు సమాచారం ఇచ్చారు. అయితే ఆ వ్యక్తి రేవులోకి అడుగుపెట్టడంతోనే బెదిరింపులు ఆరంభం అయ్యాయి. ఈ పరిస్థితులపై జడ్పీ అధికారులకు లేఖ రాసి, కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

మొదటి నుంచి వివాదమే...

గింజుపల్లి రేవు వ్యవహారంలో మొదటి నుంచి వివాదం నెలకొంది. నామమాత్రపు రుసుముతో రేవును దక్కించుకునేందుకు కొందరు సిఫార్సులు కూడా చేయించినట్లు తెలుస్తుంది. అయితే అది బహిరంగ వేలం కావడంతో అధికారులు చేతులు ఎత్తేశారు. ప్రస్తుతం పాత వ్యక్తులే రేవులో అనధికారికంగా పడవ తిప్పుతూ అధికారికంగా పాట పాడుకున్న వారిని రేవులోకి రాకుండా అడ్డుకుంటున్నట్లు తేలింది.

జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చేస్తే జర్మనీలో ఉద్యోగాలు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివి 20 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ టీవీ విజయలక్ష్మి తెలిపారు. నైపుణ్యం కోసం ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు గుంటూరు సమీపంలోని ఓబులునాయుడుపాలెం శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

525 ఎకరాల్లో ఉద్యాన పంటల పెంపకం



మాట్లాడుతున్న పీడీ శంకర్, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి 525 ఎకరాల్లో ఉపాధిహామీ పథకం కింద ఉద్యానపంటల పెంపకానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్ వెల్లడించారు. లబ్ధిదారుల గుర్తింపు, పరిపాలనామోదం మంజూరు ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోపు పూర్తిచేయాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఈ మేరకు గుంటూరు మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ 500 ఎకరాల ఉద్యానపంటలు, 25 ఎకరాల మునగపంటను ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని, వ్యవసాయ అనుబంధ శాఖల మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని లక్ష్యానికి మించి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. లబ్ధిదారులు సన్న, చిన్నకారు రైతులై వుండి ఉపాధి పథకం జాబ్‌కార్డ్ ఉంటే ఒక్కొక్క కుటుంబానికి 12నుంచి 5 ఎకరాల వరకు లబ్ధిపొందటానికి అర్హత వుంటుందన్నారు. సాధారణ ఉద్యానపంటలైతే పంట మూడేళ్ల వయసు వరకు వీరికి 100శాతం సబ్సిడీ ఉపాధి పథకం నుండి అందిస్తామన్నారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి బి.రవీంద్రబాబు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ఉద్యానపంటల సాగుకు అవకాశాలు పుష్కలంగా వున్నాయన్నారు. ఇందుకోసం రైతులను సంప్రదాయ వ్యవసాయ పంటల నుంచి ఉద్యాన పంటలకు మళ్లేలా చూడాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యానపంటల సాగుకు రైతులను గుర్తించే క్రమంలోనే ఫారంపాండ్ కూడా మంజూరుచేస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మైక్రో ఇరిగేషన్ పీడీ వజ్రశ్రీ మాట్లాడుతూ ఈ ఉద్యానపంటల లబ్ధిదారులకు ఉపాధి పథకం ముగిసిన వెంటనే సూక్ష్మ నీటి పారుదల పథకాన్ని వర్తింపజేస్తామన్నారు.

హైడ్రో గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

● రూ.7.5 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ సతీశ్‌కుమార్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలతో అప్పుల పాలై సులభంగా డబ్బు సంపాదించాలని హైడ్రో గంజాయి విక్రయిస్తున్న ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ సతీశ్‌కుమార్ నిందితుల వివరాలను వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన ఇందుకూరి రామకృష్ణంరాజు, విశాఖపట్నం సీతమ్మధార ప్రాంతానికి చెందిన నాగరాజు శ్రీహర్షవర్ధన్ వర్మ స్నేహితులు. భీమవరంలో కోడిపందేలకు వెళ్లినప్పుడు వీరికి విశాఖ జిల్లా గోపాలపట్నానికి చెందిన పురుగంటి అనిల్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. అనిల్‌కుమార్ తన వద్ద ఉన్న గంజాయిని రామకృష్ణంరాజు, హర్షవర్ధన్‌లకు విక్రయించాడు. ఇలా రెండేళ్లపాటు వీరి మధ్య గంజాయి లావాదేవీలు నడిచాయి. ఈ క్రమంలో అనిల్‌కుమార్ బెంగళూరులో తన స్నేహితుడైన అమిత్ వద్ద హైడ్రో గంజాయి ఉందని, దానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని, గ్రాము రూ.700 చొప్పున కొని రూ.1500 చొప్పున విక్రయించవచ్చని తెలిపాడు. దీంతో అనిల్‌కుమార్, రామకృష్ణలు ఈ నెల 14న కారులో బెంగళూరు వెళ్లి అమిత్ అనే వ్యక్తి వద్ద సుమారు రూ.7.5 లక్షల విలువైన 500 గ్రాముల హైడ్రో గంజాయిని కొనుగోలు చేశారు. బెంగళూరు నుంచి ఏలూరుకు తిరిగివస్తుండగా మార్గమధ్యలో కాజ టోల్‌ప్లాజా వద్ద హర్షవర్ధన్ నుంచి వారు గంజాయి తీసుకుంటుండగా పోలీసులు దాడి చేశారు. ముగ్గురు నిందితులతోపాటు 500 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడ్ని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గిన్నిస్ బుక్‌లో కర్లపాలెం విద్యార్థి

● కీబోర్డు ప్లేలో జోయెల్‌విల్సన్ ప్రపంచ రికార్డు



గిన్నిస్‌బుక్‌లో నమోదు పత్రంతో జోయెల్ విల్సన్

కర్లపాలెం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుండివారిపాలెం పంచాయతీ బీడారు దిబ్బకు చెందిన విద్యార్థి కట్టుపల్లి జోయెల్‌విల్సన్ గిన్నీస్‌బుక్‌లో స్థానం దక్కించుకున్నారు. విల్సన్‌బాబు, ప్రత్యూష దంపతుల పెద్ద కుమారుడైన విల్సన్ కీబోర్డు ప్లేతో ప్రపంచరికార్డు సాధించారు. ఇటీవల 18 దేశాల నుంచి 1046 మంది ఒకేసారి మ్యూజిక్ ప్లే చేసి గిన్నీస్‌బుక్‌లో పేరు నమోదు చేసుకున్నారు. ఆగస్టీన్ దండంగి సారథ్యంలో విల్సన్ కీబోర్డులో మెలకువలు నేర్చుకుని పోటీలో పాల్గొన్నారు. గిన్నీస్‌బుక్‌లో స్థానం దక్కించుకున్న విల్సన్‌ను జిల్లాలోని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

1,57,640 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,59,032 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,57,640 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 76,896 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13500
334	9500	13100	షార్క్-1	10000	12300
నంబరు.5	10000	12800	బ్యాడిగి 355	10000	13000
273	10000	12500	సింజెంటా		
341	10500	13500	బ్యాడిగి 5531	--	--
4884	10000	11400	దేవనూరుడీలక్స్	10000	12500
సూపర్10	--	--	ఆర్మూరు	9800	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు నేడు

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపూడి జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈనెల 17వ తేదీ గురువారం పల్నాడు జిల్లా సబ్ జూనియర్ షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ముప్పా నరసింహారావు గురువారం తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఏప్రిల్ 1, 2008 తరువాత జన్మించి ఉండాలని, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, తల్లిదండ్రుల అంగీకార పత్రంతో రావాలన్నారు. వివరాలకు 9494675082, 9848655755లను సంప్రదించాలన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీవో శివపార్వతి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, మండల, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచులు తప్పనిసరిగా హాజరుకావాలని శివపార్వతి కోరారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు

అమరావతి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం మండల పరిధిలోని దిడుగు గ్రామంలో జరిగిన కానసాని కోటేశ్వరరావు హత్యకు సంబంధించి నిందితుడు గోళ్ల జాలయ్యను బుధవారం మధ్యాహ్నం స్థానిక ఆరుడొంకల బావి సెంటర్లో అరెస్టు చేసి సత్తెనపల్లి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ అచ్చియ్య తెలిపారు. కోటేశ్వరరావు తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎకో ఓవర్సీస్ ప్రారంభం

సత్తెనపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ వద్ద టీడీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఎకో ఓవర్సీస్‌ను బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. పలువురు పార్టీ నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ సందర్శన

రెంటచింతల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గురజాల సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఎస్పీ హనుమంతరావు బుధవారం రెంటచింతల పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. దుర్గి మండలం జంగమహేశ్వరపాడు గ్రామంలో జూన్ 3వ తేదీ 2022లో జరిగిన దాడికి సంబంధించి నిందితులను ప్రశ్నించారు. అనంతరం ముగ్గురిని అరెస్టు చేసి మాచర్ల కోర్టులో హాజరుపరిచారు. ఆయన వెంట దుర్గి ఎస్ఐ సుధీర్‌బాబు ఉన్నారు.

వాట్సాప్ సేవలపై విస్తృత ప్రచారం

మాచవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చి న వాట్సాప్ సేవలపై సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల సచివాలయ సిబ్బంది వారికి కేటాయించిన గృహాలకు వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన 9552300009 అనే నెంబరు ద్వారా వినియోగించుకొనే వాట్సాప్ సేవల గురించి ఆయా కుటుంబాల వారికి వివరిస్తున్నారు. అంతేగాకుండా వాట్సాప్ నెంబరును గృహ యజమానుల ఫోన్‌లలో అప్‌లోడ్ చేసి దాని వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమాలను ఎంపీడీవో వెంగళరావు పర్యవేక్షించారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాగన్నకుంటకు చెందిన ఆటో డ్రైవర్ వెంకటేశ్వర్లు బుధవారం తెల్లవారుజామున ఎలుకల మందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. వెంకటేశ్వర్లుకు, పోలీసుస్టేషన్ రైటర్ రవీంద్రకు మధ్య జరిగిన ఫోన్ సంభాషణ మంగళవారం వెలుగులోకి రావటంతో బుధవారం వెంకటేశ్వర్లు ఎలుకల మందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్‌కు రైటర్ రవీంద్ర

పట్టణ పోలీసుస్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న రవీంద్ర పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ వెంకటేశ్వర్లుతో జరిపిన ఫోన్ సంభాషణపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. రవీంద్రను వీఆర్‌కు పంపుతూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సారా తాగటం ఆరోగ్యానికి హానికరం

● ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్

నకరికల్లు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సారా తాగటం ఆరోగ్యానికి హానికరమని ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చేజర్ల తండాలో ప్రొబిషన్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు గ్రామసభ నిర్వహించారు. సారా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని చేజర్లలో నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కే మణికంఠ, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సూర్యనారాయణ, సీఐ సోమయ్య, ఎస్ఐలు, ఏఎస్ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● అచ్చంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడువాయి పంచాయతీ పరిధిలో గల సండ్ర తండాలో గురువారం ఎక్సైజ్, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నాటు సారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కే శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ టీ తులసీ, ఫారెస్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

షిర్డి సాయి ఆలయ వార్షికోత్సవం

రెంటచింతల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలువాయిజంక్షన్‌లో శ్రీషిర్డి సాయిబాబ ఆలయ 25వ వార్షిక వేడుకలు బుధవారం అత్యంత భక్తి శ్రద్ధల నడుమ ప్రారంభమయ్యాయి. ఆలయ పూజారులు గోపాల్‌పాండే, గౌరవ పాండేల నేతృత్వంలో గణపతి పూజతో ప్రారంభమై కాకడ హారతి, సంధ్యాహారతి నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ పందిరి శ్రీనివాసరావు చెప్పారు.

గాలి, వాన విధ్వంసం

● నేలరాలిన మామిడి కాయలు
● విరిగిపడిపోయిన అరటిగెలలు
● లబోదిబో మంటున్న పొగాకు రైతులు


తడిసి నేల వాలిన పొగాకు పందిరి

రెంటచింతల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం ఈదురు గాలులు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. లక్షలాది రూపాయల పంట నీటి పాలైంది. దీంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులు వర్ష బీభత్సానికి పొగాకు, పలు పండ్ల తోటలకు నష్టం సంభవించింది. మండలంలో 12.4మి.మి వర్షపాతం నమోదైంది. ఈ క్రమంలో పశర్లపాడు, తుమృకోట తదితర గ్రామాల్లో 40 సంవత్సరాల తరువాత పొగాకు సాగును 150 ఎకరాల్లో చేపట్టగా ఆరబెట్టడానికి వేసిన పందిళ్లు నేలకూలి పొగాకంతా నీటి పాలైంద ని 11 ఎకరాలు సాగు చేసిన వీరేపల్లి లక్ష్మయ్య చౌదరి వాపోయారు. నాలుగేళ్ల నోట్లోకి పోతాయనుకున్న తరుణంలో అకాల వర్షం ఈదురు గాలులు నట్టేట ముంచాయని వాపోయారు. మామిడి తోటలో కొమ్మలు విరగడంతో పాటు మామిడి కాయలు రాలి పోయాయని ఉమర్ వాపోయారు. అలాగే అరటి తోటల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని పలువురు అన్నదాతలు చెప్పారు. వైట్‌బర్లీ పొగాకు క్వింటాల్ రూ.15 వేలకు కొనుగోలు చేస్తున్న తరుణంలో అనుకోకుండా కురిసిన వర్షానికి భారీ నష్టం సంభవించిందని కర్షకులు వేదన వ్యక్తం చేస్తున్నారు.పంట నష్టం అంచనావేసి రైతులను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.


రాలిన మామిడి కాయలు


తలలు విరిగిపడిపోయిన అరటి తోట

మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్
● వైద్యశిబిరం ప్రారంభం


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులో కాటూరి మెడికల్ కళాశాల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉంటనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ల రమేష్, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, డీసీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, టీడీపీ స్థానిక నేతలు షేక్ ముంతాజ్, మక్కెన సాగర్, నెల్లూరి మల్లిఖార్జున్, డాక్టర్ గుడిపూడి చినరాజు, మేదరమెట్ల సౌమిత్ చౌదరి, గంగినేని లీలావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

● చదువుకున్న పాఠశాలకు తన వంతు సహకారం అందించేందుకు క్రీడా వేదికను నిర్మించిన అర్తిమళ్ల రమేష్ అభినందనీయుడని ఎమ్మెల్యే ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్ గ్రామ మాజీ సర్పంచ్ అర్తిమళ్ల నళిని జ్ఞాపకార్థం ఆమె భర్త రమేష్ నిర్మించిన అర్తిమళ్ల నళిని క్రీడా వేదికను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ వెంకట నాగరాజు, టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పెదకూరపాడులో రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో ఏవో ఇంజం శాంతి, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం అంజనేయులు, సర్పంచ్ రాజు, డీసీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

● పెదకూరపాడులోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో బుధవారం ప్రజాదర్బార్(గ్రీవెన్స్) నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలతో కూడిన వినతిపత్రాలను ఎమ్మెల్యే ప్రవీణ్ స్వీకరించారు. అధికారులు సమస్యలను పరిష్కరించడంలో దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నీలి ధనలక్ష్మి, ఎంపీడీవో సోమయాజులు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

చామర్రులో వరసిద్ధి వినాయకుడికి పూజలు

అచ్చంపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట పంచాయతీ పరిధిలోని చామర్రులో గల వరసిద్ధి వినాయకుడి ఆలయంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఆయన సతీమణి లావణ్య ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి జరిగిన పూజల్లో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, మొక్కపాటి గిరిబాబు, వెనిగండ్ల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలి

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్


మంత్రి సంధ్యారాణికి సమస్యలు వివరిస్తున్న ధారూనాయక్

మాచర్ల రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలోని గిరిజనుల అభివృద్ధికి తోడ్పాటునందించాలని గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారూనాయక్ కోరారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రిని కలిసి పలు సమస్యలను వివరించారు. వేసవి కాలం దృష్ట్యా పల్నాడులోని గిరిజన తండాల్లో తాగునీటి సమస్యపై చర్యలు చేపట్టాలని కోరారు. సుమారు 30 ఏళ్లుగా అటవీ భూముల్లో పంటలు సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలను మంజూరు చేయాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో ఉండే నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని మంత్రికి విన్నవించారు. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు చొరవతో పల్నాడు ప్రాంతంలోకి కారంపూడి, వినుకొండ, నరసరావుపేట ప్రాంతాల్లో రూ.17 కోట్లతో నిర్మించిన ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలల ప్రారంభోత్సవానికి విచ్చేయాలని కోరారు.

వక్ఫ్‌బోర్డు బిల్లు సవరణకు నిరసనగా ముస్లింల ర్యాలీ


మాచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మాచర్లటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లు సవరణ చట్టంకు నిరసనగా బుధవారం ముస్లిం సమైక్య వేదిక, ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో ముస్లింలు పట్టణంలో ర్యాలీ జరిపారు. ముస్లింలంతా ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు.

● కారంపూడి (ఆంధ్రజ్యోతి): కారంపూడిలో బుధవారం ముస్లింలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ బుడేశా, అధ్యక్షుడు షేక్ మోదీన్సా, జడ్పీటీసీ షేక్ షఫి, సీపీఐ కార్యదర్శి సైదా, ఎంపీటీసీ షేక్ ఆరీఫ్, నన్నేసా, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లపై మామిడి రైతులు అప్రమత్తంగా ఉండాలి


మామిడి రైతులకు సూచనలు చేస్తున్న డివిజన్ ఉద్యాన శాఖ అధికారి నవీన్ కుమార్

క్రోసూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : తెగుళ్ళు వ్యాపించకుండా మామిడి రైతులు అప్రత్తంగా ఉండాలని డివిజన్ ఉద్యాన శాఖ అధికారి నవీన్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని పెరికపాడు, ఆవులవారి పాలెం గ్రామాల్లో తెగుళ్ళు వ్యాపించిన మామిడి తోటలను ఆయన పరిశీలించారు. దీని వల్ల పిందెలు, కాయలు రాలి పోతున్నాయని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎప్పటికప్పుడు అధికారులను సంప్రదిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని, లేకపోతే అధిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. రెండు గ్రామాల్లోను మామిడి తోటలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఉద్యాన సహాయకులు హరికృష్ణ, కమల, దివ్య తదితరులు పాల్గొన్నారు.


విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంత్రి దుర్గేష్ నుంచి కందుకూరి రంగస్థల పురస్కారాలు అందుకుంటున్న పల్నాడు జిల్లాకు చెందిన వీసీ ప్రసాద్, షేక్ షరీఫ్, డీ అన్నపూర్ణ, జీ వెంకటలక్ష్మయ్య

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో రవి ఆకస్మిక తనిఖీ

బెల్లంకొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్రాజుపాలెం పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా చిన్న పిల్లల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సందర్శించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి జాతీయ ఆరోగ్య కార్యకర్తలు, లక్ష్య సాధన, వాటి ప్రగతి గురించి వివరించారు. నర్సుల వద్దకు వెళ్లి డెలివరీలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎందుకు ప్రోత్సహించటం లేదని ప్రశ్నించారు. ల్యాబ్‌ను, ఆరోగ్యకేంద్రంలోని పరికరాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో డాక్టర్ నజీర్, సీహెచ్‌వో మణి కుమారి, సూపర్‌వైజర్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల దుకాణాల్లో తనిఖీ

సత్తెనపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కార్యాలయం నుంచి వచ్చిన ఆర్ శశిధర్‌రెడ్డి, ఈఎస్ సురేష్‌లు స్థానిక వ్యవసాయశాఖ అధికారులతో కలసి బుధవారం పట్టణంలోని పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తన డీలర్లు కలుపు మందును తట్టుకొనే పత్తి విత్తనాల నిల్వలు, అమ్మకాలకు రాష్ట్రంలో అనుమతి లేదన్నారు. అటువంటి నిషేధిత పత్తి విత్తనాలు ఎవరైనా విత్తన డీలర్లు నిల్వలు చేసి అమ్మకాలు జరుపుతున్నారేమోనని తనిఖీలు చేశామన్నారు. విత్తన డీలరు రైతులకు తప్పనిసరిగా విత్తన కొనుగోలు రసీదు ఇవ్వాలని అన్నారు. వారితో పాటు స్థానిక వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

● పిడుగురాళ్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో బుధవారం గుంటూరు ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ఏడీఏ ఆర్ శశిధర్‌రెడ్డి, కమిషనర్ కార్యాలయ అధికారి సురేష్‌లు తనిఖీలు నిర్వహించారు. రైతులు గుర్తింపు పొందిన డిస్ట్రిబ్యూటర్, డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు.

● రెంటచింతల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని పత్తి విత్తన దుకాణాలను కమిషనర్ కార్యాలయం వ్యవసాయ సహాయ సంచాలకులు శశిధర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. తనిఖీలో వ్యవసాయాధికారులు బోయపాటి బ్రహ్మారెడ్డి, వీఎస్ సురేష్, రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ లైట్ల కోసం రూ.లక్షా10వేల విరాళం


ఎంపీడీవోకు చెక్కును అందజేస్తున్న స్నేహ హస్తాల ఫౌండేషన్ సభ్యులు

అచ్చంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుంపాలెం గ్రామ పంచాయతీకి ప్రధాన కూడళ్ళ వద్ద సోలార్ లైట్లు ఏర్పాటు చేసేందుకు స్నేహహస్తాల ఫౌండేషన్ సభ్యులు రూ.లక్షా 10వేల చెక్కును ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు చేతుల మీదుగా కార్యదర్శి బత్తుల శివయ్యకు అందజేశారు. 15 సోలార్ ల్యాంప్‌ల ఏర్పాటు కోసం చెక్కును అందిస్తున్నట్టు స్నేహ హస్తాల ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ తాయి కరీముల్లాబాబు తెలిపారు.

మేధా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న దాత కందుల శ్రీనివాసరావు కుటుంబం

పిడుగురాళ్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామతీర్థ సేవాశ్రమం సమీపంలో శ్రీమేధా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ, దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ, అన్నదానం దాత కందుల శ్రీనివాసరావు, మాధవి దంపతులు పాల్గొన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి రూ.17 లక్షల విరాళాన్ని శ్రీనివాసరావు అందజేశారు. పురోహితులు, దేవాలయ కమిటీ సభ్యులు విగ్రహ ప్రతిష్ఠ పూజాది కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లుకు మంత్రివర్గ ఆమోదం చరిత్రాత్మక నిర్ణయం

క్రోసూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును మంత్రి వర్గం ఆమోదించడం చరిత్రాత్మకమైన నిర్ణయమని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు దుద్దుల యోహాన్ అన్నారు. టీడీపీ నాయకులతో కలసి బుధవారం ఆయన క్రోసూరులో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో రెల్లి ఉపకులాలకు ఒక శాతం, మాదిగ ఉప కులాలకు 6.5 శాతం, మాల ఉప కులాలకు 7.5 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ బిల్లును ఆమోదించటం హర్షణీయమన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలోని 59 షెడ్యూల్ కులాలకు వెనుకబాటు తనం, సామాజిక చైతన్యం ఆధారంగా రిజర్వేషన్‌లు కల్పించటం ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపునకు నిదర్శనమన్నారు. ఆర్థికంగాను, సామాజికంగాను, ఉపాధి పరంగాను వెనుకబడి ఉన్న షెడ్యూల్ కులాల వారికి వర్గీకరణ వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసిన ఎందరో నాయకులకు, ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు సమర్పించిన అధికారులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనతో పాటు టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు చంద్రశేఖర్, అక్కులు, రత్నం, మరియదాసు, ఏసయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


ప్రజావేదికలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజావేదికను నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందించారు. తన వద్దకు వచ్చిన ప్రజలను సమస్యల గురించి కన్నా లక్ష్మీనారాయణ అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి వాటిని పరిశీలించి ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలోని అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలను పరిష్కరించాని సూచించారు.

బాలాత్రిపురసుందరీదేవి సన్నిధిలో ఎమ్మెల్యే దంపతులు


బాలత్రిపురసుందరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు

మాచర్లటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలో ఉన్న బాలాత్రిపురసుందరీదేవిని బుధవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు, వారి కుమారుడు గౌతమ్‌రెడ్డిలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కుంకుమార్చన వంటి విశేష పూజలు నిర్వహించారు. అలాగే కొండపై కొలువైన త్రిపురాంతకేశ్వరస్వామిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే


రీసర్వేపై ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీసర్వే జరుగుతుందని తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి అన్నారు. మండలంలోని గుడిపాడులో బుధవారం రెండో విడత రీసర్వే గ్రామసభ జరిగింది. గ్రామసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భూ వివాదాల ప్రక్షాళనకు ఈ రీసర్వే ఉపయోగ పడుతుందన్నారు. రీసర్వే జరిగేటప్పుడు సంబంధిత భూయజమాని తమ భూమి పైకి వచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రీసర్వే ప్రక్రియను ఆయన ప్రారంభించారు. గ్రామంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించి రీసర్వే పై రైతులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ ఎన్ రవికుమార్, ఆర్ఐ బోసుబాబు, మండల సర్వేయర్ విజయ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో కూలీలకు వసతుల ఏర్పాటు

మాచవరం, ఏప్రిల్ 16 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకానికి సంబంధించి పని ప్రదేశాల్లో కూలీలకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు. వేమవరంలో కాల్వ పూడికతీత పనుల వద్ద ఎండ వేడిమిని తట్టుకొనేందుకు పరదాల ఏర్పా టు, మంచి నీటివసతి, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేయడం వంటి మౌలిక వసతులు ఫీల్డ్ అసిస్టెంట్ కామిశెట్టి గోపాలరావు ఏర్పాటు చేశారు. ఉదయం ఎండ వేడిమి ఎక్కువగా ఉండటం వల్ల మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనులు చేయిస్తున్నట్టు ఫీల్డ్ అసిస్టెంట్ తెలిపారు. దీనివల్ల కూలీల సంఖ్య కూడా పెరుగుతుంది.

ఉపాధి పనులు పరిశీలించిన ఎంపీడీవో

అచ్చంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుట్లగూడెం గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలకు వసతి సౌకర్యం కల్పించాలని, ప్రతిఒక్కరికి రూ.307 దినసరి వేతనం అందేవిధంగా పని చేయాలని సూచించారు. మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరిగేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. పుట్లగూడెం వద్ద జరుగుతున్న ఫారం ఫాండ్ పనులను పరిశీలించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ తరువాత వచ్చే పీఎఫ్ బెనిఫిట్స్ కోసం గుండెపోటుతో ఓ ఉపాధ్యాయుడు అకస్మికంగా మరణించాడు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ళ మండలం బ్రాహ్మణపల్లి జడ్పీ స్కూల్లో పనిచేసే చల్లా వెంకటరెడ్డి(ఎస్ఏ ఇంగ్లిష్) బుధవారం పీఎఫ్ స్లిప్‌పై కౌంటర్ సిగ్నేచర్ కోసం డీఈవో కార్యాలయానికి వచ్చాడు. డీఈవో కార్యాలయం బయటకు వచ్చే సమయంలో గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న ఉర్దూ డీఐ ఎస్‌కే ఎండీ ఖాశిం, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది. వెంకటరెడ్డి మిత్రులు హుటాహుటిన నగరంపాలెంలోని రమేష్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వెంకటరెడ్డి మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. డీఈవో సీవీ రేణుక, తూర్పు ఎంఈవో ఖుద్దూస్ తదిరులు వెంకటరెడ్డి మృతదేహాన్ని సందర్శించి ఆయనకు నివాళులర్పించారు. వెంకటరెడ్డి ఈ ఏడాది జూన్‌లో పదవీ విరమణ చేయనున్నారు. వెంకటరెడ్డి మరణం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి చేస్తున్నట్లు ఏపీటీఎఫ్ అధ్యక్షుడు కె.బసవలింగారావు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని మహిళ శిశు సంక్షేమ శాఖ సీడీపీవో కార్యాలయంలో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నరసరావుపేట ఫైర్ అధికారి ఎంవీ సుబ్బారావు పాల్గొన్నారు. గ్యాస్, ఎలక్ట్రిసిటీ తదితర అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి బి.కృష్ణారెడ్డి, డీసీపీవో శౌరిరాజు, సీడీపీవో ఉమామహేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, స్థానిక గృహిణులు పాల్గొన్నారు.

సివిల్స్ అభ్యర్థులకు శిక్షణ: ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా సివిల్స్ రాసేందుకు అభ్యర్థులకు శిక్షణ అందించనున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబోతున్నామన్నారు. బుధవారం ఈ మేరకు జీవీ ఆంజనేయులు విలేకరులతో మాట్లాడుతూ వినుకొండలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ మహిళా అభ్యర్థుల్లో ప్రతిభ ఉన్నవారిని 10మందిని ఎంపికచేసి శివశక్తి ఫౌండేషన్ తరఫున 30నెలల పాటు వసతి, భోజనం సహా ఉచిత శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. ఆదివారం అందుకు సంబంధించిన పరీక్ష నిర్వహిస్తున్నామని వెల్లడించారు. వినుకొండ పట్టణంలోని కురిచేడు రోడ్డులోని సీతారామపురం ఐనవోలు దగ్గర ఉన్న డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ భవనంలో ఆ పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారంతా ఆదివారం పరీక్షకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 8639379369ను సంప్రదించాలన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

వినుకొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శృంగారపువనంలో నూతన ఆర్వో ప్లాంట్‌ను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

21 నుంచి డ్రైయిన్లపై ఆక్రమణల తొలగింపు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోడ్డు మార్జిన్, ఫుట్‌పాత్, డ్రైయిన్లపై ఆక్రమణలు తొలగిస్తామని ఎం.జస్వంతరావు బుధవారం తెలిపారు. నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో ఉన్న రోడ్డు మార్జిన్‌లో దుకాణాలకు సంబంధించిన అనధికార బోర్డులను, ఫుట్‌పాత్‌లపై, డ్రెయిన్లపై ఆక్రమణ చేసి వ్యాపారాలు చేస్తున్నారని అన్నారు. వాటివలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. డ్రెయిన్ల మీద ఆక్రమణలు ఉండటం వలన వర్షాకాలంలో మురుగునీరు నిలిచిపోతున్నాయని, దీనివలన పట్టణ ప్రజలకు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. ఆక్రమణదారులందరూ స్వచ్ఛందంగా ఆక్ర మణలు తొలగించాలని, లేనిపక్షంలో ఎలాంటి నోటీసులు లేకుండా పురపాలకసంఘం వారు పోలీస్ సహకారంతో తొలగిస్తామన్నారు. ప్రజలందరూ ఆక్రమణలను తొలగించేందుకు సహకరించాలన్నారు.

శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 460 మందికి కంటి పరీక్షలు

శావల్యాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వేల్పూరు, పోట్లూరు, ఇర్లపాడు, బొందిలిపాలెం, శానంపూడి గ్రామాల్లో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాల్లో 460మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. పెదకాకానిలోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు స్కైలాప్ కిరణ్, సైదులు, నాగబాబు, రాంబాబు వైద్యపరీక్షలు నిర్వహించారు. 460లో 265మందికి కంటి శుక్లాలు ఉన్నట్లు నిర్ధారించారు. వీరిని ఈ నెల 27వ తేదీన శంకర్ ఆసుపత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమాన్ని జడ్పీటీసీ పారా హైమావతి, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒత్తుల వెంకటేశ్వర్లు, తెలుగు యువత జి.ధనుంజయ్, సంగం డెయిరీ డైరెక్టర్ జి.ఆంజనేయులు, సర్పంచ్ వి.రమాదేవి ఆంజనేయులు, డీసీ చైర్మన్ ఎం.వెంకటనారాయణ, మాజీ ఎంపీపీ ఎ.కోటయ్య, గ్రామపార్టీ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

దివ్యాంగులకు విద్యా సామగ్రి పంపిణీ

శావల్యాపురం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురంలోని భవిత పాఠశాలలోని దివ్యాంగులకు బుధవారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. బండి గోపాల కృష్ణమూర్తి జయంతిని పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యులు ఈ సామగ్రిని వితరణగా అందించారు. ఆరంబ్ ఏడ్యూ ఫౌండేషన్ అధ్యక్షుడు, హెచ్ఎం బిక్కా రాజారమేష్ విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవాసంస్థలు, దాతల సాయంను అభినందించారు. భవితా పాఠశాల ఉపాధ్యాయులు జగన్మోహన్‌రెడ్డి, పార్వతి పాల్గొన్నారు.

మహిళ మృతి కేసులో దోషులను గుర్తించి శిక్షించాలి: బొల్లా

వినుకొండ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుపాలెం గ్రామ సమీపంలో పది నెలల క్రితం చింతలదేవి మృతికి కారకులను అదుపులోకి తీసుకొని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు డిమాండ్ చేశారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళ మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు బహిరంగ లేఖను రాస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు న్యాయవాది ఎం.ఎస్.ప్రసాద్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ అమ్మిరెడ్డి అంజిరెడ్డితో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో వినతి పత్రాల స్వీకరణ



పజాదర్బార్‌లో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు సమస్యలను తెలియజేస్తున్న ప్రజలు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కొత్తపేటలోని ప్రభుత్వ చీఫ్‌విప్ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజాదర్బార్‌కు నియోజకవర్గ ప్రజల నుంచి విశేషస్పందన లభించింది. వినుకొండ పట్టణంలో ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు తదితర సామగ్రి నిషేధంపై ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి వ్యాపారులు జీవీ ఆంజనేయులును కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని నరగాయపాలెం, పాత నరగాయపాలెం సమీపంలో ఆక్రమణకు గురైన పెద్దేటి ఏసురత్నం, పోలయ్యలకు చెందిన భూములను ఆక్రమణదారుల నుంచి తమ భూములను తమకు ఇప్పించాలంటూ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అధికారాన్ని వినియోగించుకొని రికార్డులను తారుమారు చేసి తన బంధువుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్.వెంకటేశ్వర్లు అనే వ్యక్తి జీవీ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులపై జీవీ సమీక్ష

వినుకొండ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామి దేవాలయంతో పాటు, ఘాట్ రోడ్డు నిర్మాణ పనులను సుమారు 8 నెలల వ్యవధిలో ప్రభుత్వ, దాతల సహకారంతో పూర్తిచేస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. కొత్తపేటలోని చీఫ్‌విప్ కార్యాలయంలో దేవదాయశాఖ ఇంజనీరింగ్ విశ్రాంత అధికారి అశోక్ కుమార్, (కొటప్పకొండ ఘాట్ రోడ్డు పూర్వపు అధికారి) దేవదాయశాఖ డీఈ శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఎస్సీ బ్రహ్మయ్య, జాతీయ్య ఉపాధి హామీ పీడీ సిద్ది లింగమూర్తితో పాటు స్థానిక అధికారుతో కలిసి బుధవారం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో దేవాలయం నిర్మిస్తామని చెప్పి పునాదులకే పరిమితం చేసి సుమారు రూ.3.26 కోట్లు నిధులు డ్రా చేశారని, కానీ ఘాట్ రోడ్డుతో పాటు, దేవాలయం పనులు పూర్తి కాలేదని జీవీ వెల్లడించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.5.90 కోట్లు, గిరి ప్రదర్శన రోడ్డు నిర్మాణానికి 1.20కోట్లు, రామలింగేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయించామని తెలిపారు. దాతల సహకారంతో నూతన కమిటీ సభ్యులు చొరవతీసుకుని త్వరలో జరగనున్న పనులను వేగవంతం చేయాలని కోరారు. జూలై-7వ తేదీన జరగనున్న తొలిఏకాదశి పండుగ నాటికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొండపై తాగు నీరు, విద్యుత్‌తో పాటు గ్రీనరీ తదితర పనులు పూర్తి చేసేందుకు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మునిసిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, జనసేన నాయకులు నాగశ్రీను, నిశ్శంకర శ్రీను, బీజేపీ నాయకులు లెనిన్, మునిసిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, తహసీల్దార్ సురేష్ నాయక్, పంచాయతీరాజ్ డీఈలు కొండయ్య, గంగయ్య, విద్యుత్‌శాఖ ఏఈ పిచ్చయ్య, వినుకొండ సర్వేయర్ పి.చండీరాణి, ఆర్అండ్‌బీ అధికారులతో పాటు న్యాయవాదులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతుల భూములు ఇనాం జాబితాలోకి వెళ్తుంటే ఏం చేస్తున్నారు?

● అధికారులపై ఎమ్మెల్యే పుల్లారావు ఆగ్రహం



ఎమ్మెల్యే పుల్లారావుకు సమస్యలపై అర్జీలను అందజేస్తున్న రైతు

నాదెండ్ల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రైతుల భూములు ఇనాం జాబితాలోకి వెళ్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని? ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణపవరం మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు, పెంటాల శేషయ్య తదితరులు తమ గ్రామంలో సుమారు 1700ఎకరాల భూమి ఇనాం జాబితాలో చేర్చటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన పుల్లారావు పక్కనే ఉన్న తహసీల్దార్‌తో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌లో సమస్యను వివరించారు. ఈ సందర్భంగా హిమవంతరావు అందించిన సమాచారాన్ని కలెక్టర్‌కు వివరించారు. సమస్యను పరిష్కరించి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ వివరించారు. మండల సర్వేయర్ రాంబాబు కనీసం ఫోన్ చేసినా స్పందించటం లేదని పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యే పుల్లారావుకు వివరించారు. ఈ క్రమంలో పనులు చేయకపోతే వెళ్ళిపో, కలెక్టర్‌కు చెప్పి మరొకరిని సర్వేయర్‌గా వేయించుకుంటామని పుల్లారావు రాంబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గణపవరంలో అర్ధంతరంగా నిలిపివేసిన ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు పనులను పూర్తి చేయాలని కోరారు. ఇలా పలు సమస్యలను పలు గ్రామాలకు చెందిన వారు పుల్లారావు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ఇతర సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఇచ్చిన అర్జీల ఆధారంగా సమస్యలను పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి, ఎంపీపీ తలతోటి రాణి, డీఈఈ అశోక్ కుమార్, సీఐ సుబ్బనాయుడు, సర్పంచ్ ఎం నాగలక్ష్మి, నాయకులు సదాశివరావు, గంగా శ్రీనివాసరావు, నల్లమోతు హరిబాబు, కందుల రమణ తదితరులు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



చిలకలూరిపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న డాక్టర్ కొల్లా, వివిధ పార్టీల నాయకులు

చిలకలూరిపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకును పండించిన రైతులకు గత ఏడాది మాదిరిగా ధర చెల్లించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ పార్టీలు, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పొగాకు రైతులకు న్యాయమైన, లాభదాయకమైన ధరలు లభించేలా చూడటం, ఎగుమతులను ప్రోత్సహించడం పొగాకు బోర్డు ప్రాథమిక కర్తవ్యం అన్నారు. అయితే పొగాకు బోర్డు ఎఫ్‌సీటీ వర్జీనియా పొగాకును మాత్రమే పట్టించుకుంటూ బర్లీ పొగాకు, నాటు పొగాకు తమ పరిధిలో లేవంటూ తప్పుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏప్రిల్ ఒకటో తేదీ పర్చూరు పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు బర్లీ పొగాకు రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకు నెరవేరలేదన్నారు. కంపెనీలు గత సంవత్సరం రేటుకు కొనుగోలు చేయకపోతే ప్రభుత్వం మార్కెఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ హుస్సేన్‌కు వారు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి టి.బాబురావు, నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు, సీఐటీయూ పల్నాడు జిల్లా కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎం రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొచ్చెర్లలో ఘర్షణ: నలుగురికి గాయాలు

ఈపూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఘర్షణలో నలుగురు గాయపడిన సంఘటన మండలంలోని కొచ్చెర్లలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన తన్నీరు కోటేశ్వరరావు, గోలి లక్ష్మణరావు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో కోటేశ్వరరావు, గోపి, లక్కిశెట్టి బుచ్చమ్మ, రాగాల భువనేశ్వరిలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఈపూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరు కుటుంబాల ఫిర్యాదుల మేరకు విచారణ చేసి కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు.

వలస కార్మికుడు అనుమానాస్పద మృతి

యడ్లపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వలస కార్మికుడు మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం భద్రక్‌జిల్లా జగన్నాధప్రసాద్ మండలం దదిభమనపూర్ గ్రామానికి చెందిన బీంసేన్‌మాలిక్ (45) నాలుగేళ్ళక్రితం ఉపాధికోసం వలస వచ్చాడు. యడ్లపాడు మండలం తిమ్మాపురం పరిధిలోని భవనం టెక్స్‌టైల్స్‌లో చేరాడు. మిల్లు క్వార్టర్స్‌లో ఒంటరిగా నివాసం ఉండేవాడు. ఈ నెల 13వ తేదీ ఉదయం సహోద్యోగి, ఒడిశా రాష్ట్రానికి చెందిన బసంత్ మాలిక్ విధులకు వెళుతూ బీంసేన్ మాలిక్ నివాసం ఉంటున్న క్వార్టర్‌కు వచ్చి బీంసేన్ మాలిక్ అపస్మారక స్థితిలో పడిఉండడాన్ని గమనించి మిల్లు సూపర్‌వైజర్‌లకు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతిగా మద్యం సేవించడం వలన మృతిచెందినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

వివాహిత మృతి కేసులో ఇద్దరు అరెస్టు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పమిడిమర్రు గ్రామానికి చెందిన సిఫోరి (23) అనే వివాహిత ఈ నెల 13వ తేదీన బలవన్మరణానికి పాల్పడింది. ఈ నేపథ్యంలో తండ్రి ఫిర్యాదు మేరకు నాగరాజు, పార్వతిలను బుధవారం నరసరావుపేట రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. కేసు దర్యాప్తులో నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్ కాలువకు మరమ్మతులు చేయించండి

● డీఈకి ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్థుల వినతి

వినుకొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపల్లి, విఠంరాజుపల్లి మధ్యలో ఉన్న మైనర్ ఇరిగేషన్ కాలువను మరమ్మతులు చేపట్టాలని డీఈకి ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి రోడ్డు నుంచి నరసరావుపేట రోడ్డు వరకు ఒక కిలోమీటరు పైగా కాలువకు రెండువైపులా కంపచెట్లు పెరిగి రహదారి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై అధికారులకు అర్జీలు పెట్టిన తరువాత ఇటీవల రెండువైపులా సర్వే చేసి హద్దులు నిర్ణయించడమైందన్నారు. వర్షాకాలనికి ముందే మరమ్మతులు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. అనంతరం ప్రజాదర్బార్‌లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు అర్జీ ఇచ్చారు.

అకాల వర్షాలతో తడిచిన మిరపకాయలు

నరసరావుపేట రూరల్, బొల్లాపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గత రెండురోజులుగా అకాల వర్షాలకు కల్లాలోని మిరపకాయలు తడిచిపోయాయి. బొల్లాపల్లి మండలంలోని రామాపురం, పలుకూరు, గుంట్లపల్లి, కండ్రిక, గుంగుపల్లి గ్రామాల్లో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పొలంలో ఆర పెట్టిన మిరపకాయలు పూర్తిగా తడిచిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులపై డీపీవో విచారణ

యడ్లపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి ఎం.విజయభాస్కరరెడ్డి, మండల ప్రత్యేక అధికారి బాలసుబ్రమణ్యంలు బుధవారం మండలంలో పర్యటించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపారు. మండలంలో ఉన్నవ ఎస్సీ కాలనీకి చెందిన దేవదానం కాలనీలో మురుగునీరు బయటకు వెళ్ళడం లేదని, ఎన్నిసార్లు పంచాయితీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై గ్రామాన్ని సందర్శించి సమస్యను పరిశీలించిన డీపీవో అర్జీదారుని పిలిపించి అధికారుల సమక్షంలో విచారించారు. సమస్య పరిష్కారానికి తీసుకోవలసిన అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు.

కూటమి ప్రభుత్వంతోనే దళితుల అభ్యున్నతి సాధ్యం

ఏపీ ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని, దళితుల అభ్యున్నతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని చంద్రబాబునాయుడు రుజువు చేశారని ఏపీ ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్ అన్నారు. బుధవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాతులూరి కుమార్ మాట్లాడుతూ 1997 జూన్ 6న ప్రభుత్వం జీవో ద్వారా షెడ్యూల్డ్ కులాల కోటాను వర్గీకరించిందన్నారు. విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమసరమని ధర్మాసనం తుది తీర్పు ఇచ్చిందన్నారు. కేబినెట్ ఆమోదంతో ఎస్సీలందరూ కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటారని అన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇన్నగంటి జగదీష్, జిల్లా ప్రధానకార్యదర్శి కొట్టా కిరణ్, జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జీపీ కుమార్, ఎం ప్రభాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● చిలకలూరిపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ వార్డులో వార్డు కౌన్సిలర్ కూనల ప్రమీల సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ గురించి ప్రచారం చేశారు. 9552300009కు హాయ్ అని మెసేజ్ చేసి ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

● నూజెండ్ల: ప్రభుత్వ సేవలను సులభతరంగా వాట్సాప్ ద్వారా అందిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి జానీ బాషా వివరించారు. మండలంలోని వి అప్పాపురంలో బుధవారం వాట్సాప్ సేవలు వినియోగంపై గ్రామంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రభాకర్, వెటర్నరీ అసిస్టెంట్ నితిన్ పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: స్థానిక శాఖా గ్రంథాలయానికి జనసేన పార్టీ నాయకులు అచ్చుకోల మురళీకృష్ణ అంబేద్కర్ చిత్రపటాన్ని బుధవారం బహుకరించారు.

● చిలకలూరిపేట: స్థానిక జానకీ నర్సింగ్ హోమ్‌లో చిన్న ఇనుప మేకు మింగిన గుర్రాల చావిడి ప్రాంతానికి చెందిన రెండేళ్ల బాలికకు లివర్ అండ్ గ్యాస్ట్రో వైద్య నిపుణుడు డాక్టర్ బలరామకృష్ణ తేజస్వి ఎండోస్కోపీ విధానంతో కడుపులోని మేకును గుర్తించి బుధవారం బయటకు తీశారు. రిస్క్ కూడిన వైద్యం చేసిన తేజస్విని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక ఎన్‌జీవో కాలనీలో లక్ష్మీనారాయణ సహిత అష్టలక్ష్మీ అమ్మవార్ల, జీవధ్వజ, విమాన, శిఖర, గరుడ, గణపతి, ఆంజనేయ, సరస్వతి, బలిపీఠం ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, బులియన్ మర్చంట్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు.

● రొంపిచర్ల: పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శశిదేవి, దేవీబాయి, షమీమ్ సుల్తానా బుధవారం తెలిపారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో జరిగిన పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆషా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ లక్ష్మీనారాయణ విజిలెన్స్ కమిటీ సభ్యుడు నారాయణ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పల్నాడు రోడ్‌ని హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని హోటల్లు, షాపులపై కేసులు నమోదు చేశామని లక్ష్మీనారాయణ తెలిపారు.

● నరసరావుపేట టౌన్: శాంతి సమాజ నిర్మాణమే మానవత ధ్యేయమని ఎంఎఎం కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు అన్నారు. బుధవారం ఎంఎం గ్రూప్ కళాశాలల్లో మానవత సంస్థ నూతన శాఖను స్థాపించటంపై అవగాహన సమావేశం జరిగింది. కార్యక్రమంలో మానవత చైర్మన్ పావులూరి రమేష్, డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, బి.మురళి, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంత్రి దుర్గేష్ నుంచి కందుకూరి రంగస్థల పురస్కారాలు అందుకుంటున్న పల్నాడు జిల్లాకు చెందిన వీసీ ప్రసాద్, షేక్ షరీఫ్, డీ అన్నపూర్ణ, జీ వెంకటలక్ష్మయ్య

భువనచంద్ర టౌన్‌హాల్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఆర్డీవో మధులత, పక్కన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట కల్చరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) భువనచంద్ర టౌన్ హాల్ నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు శనివారం రాత్రి భువనచంద్ర టౌన్‌హాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో నరసరావుపేట ఆర్డీవో మధులత నూతనంగా ఎన్నుకున్న కమిటీతో ప్రమాణాస్వీకారం చేయించారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, అధ్యక్షుడిగా పట్టణ ఆర్డీవో ఉన్నారు. కాగా ఉపాధ్యక్షుడిగా జవ్వాజి వెంకట్రావు, సెక్రటరి గుత్తా అంకమ్మచౌదరి, కన్వీనర్ మహమ్మద్ సర్దార్‌పాషా, నంబూరి నాగ మురళీకృష్ణ, కొత్తమాసు సుధాకర్, యర్రంశెట్టి నరహరి, షేక్ జాన్‌సైదా, సిద్దు అనంత నాగబ్రహ్మచారి, దమ్మవళపు ఏడుకొండలు, ఇలవరపు విష్ణువర్ధన్, చావా బాబులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొన్నారు. కమిటీకి న్యాయ సలహాదారుగా అబ్బూరి ఏడుకొండలును ఎన్నుకొన్నారు.

అపార్టుమెంట్లలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

చిలకలూరిపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ వారోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలోని ఎంవీ నారాయణపురం ప్రాంతంలోని పలు అపార్టుమెంట్లలో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. గ్యాస్ ఫైర్స్, ఎలక్ట్రిక్ ప్రమాదాలపై అవగాహన కల్పించి, తీసుకోవలసిన జాగ్రత్తలు, సురక్షిత పద్ధతులను వివరించారు. అనంతరం కరపత్రాల పంపిణీ చేశారు. అగ్నిమాపక అధికారి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి, లీడింగ్ ఫైర్ మాన్ ఆర్.మాణిక్యరావు పాల్గొన్నారు.

మామ బెదిరింపులపై వివాహిత ఫిర్యాదు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆస్తిని ఫోర్జరీ సంతకాలతో బదలాయించుకునేందుకు యత్నిస్తూ, తనను మామ బెదిరిస్తున్నాడని తమకు న్యాయం చేయాలని చిలకలూరిపేటకు చెందిన గోళ్ల బిందు అనే మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి వినుకొండ పోలీస్‌స్టేషన్ వద్ద ఫిర్యాదు చేశారు. చిలకలూరిపేటకు చెందిన గోళ్ల బిందుకు వినుకొండకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. తమకు సంతానం కలిగిన తర్వాత చిన్నారుల పేరిట తన భర్త ఆస్తిని బదలాయించాడని తెలిపింది. అయితే భర్తతో విభేదాలు రావటంతో తాను భర్తపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపింది. దీంతో చిన్నారుల పేరిట బదలాయించిన ఆస్తిని, అప్పులు ఉన్నాయంటూ తన మామ గోళ్ల మహేశ్వరరావు ఫోర్జరీ సంతకాలతో బదలాయించుకునేందుకు యత్నిస్తున్నారని, భవన తాళాలను పగలగొట్టి స్వాధీనం చేసుకోవటమే కాకుండా తనను ఫోన్‌లో బెదిరిస్తున్నారని ఆమె ఆరోపించింది. దీనిపై తనకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ముందుగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేసింది. అనంతరం వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులతో కలిసి ఆమె ఫిర్యాదు చేసింది.

గ్యాస్ సిలిండర్ పేలి నలుగురికి గాయాలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భావనారుషి నగర్‌లో బుధవారం ఉదయం ఒక టిఫిన్ సెంటర్లో గ్యాస్ సిలిండర్ పేలి నలుగురు గాయపడ్డారు. గ్యాస్ లీక్ అయి మంటలు వచ్చి సిలిండర్ పేలడంతో మంటలు టిఫిన్ సెంటర్ మొత్తానికి వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది వారు ఫైర్ ఆఫీసర్ ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అక్కడకు వచ్చి మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.లక్ష మేరకు ఆస్తి నష్టం జరిగిందని అంచనావేశారు. గాయపడ్డ వారిలో చిన్నం ఆదిబాబు (35), పి.కోటేశ్వరరావు (21), బి.సీతారావమ్మ (52), పి.జాలయ్య (54) ఉన్నారు. గాయపడ్డ వారిని చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చిలకలూరిపేట అర్బన్ సీఐ పి రమేష్ బాబు, రెవెన్యూ అధికారులు ప్రమాద ప్రదేశాన్ని పరిశీలించారు.